# బోస్టన్ తెలుగు సాహిత్య వేదిక

తెలుగు సాహిత్యం,
ముందు తరాల కోసం...

బోస్టన్ తెలుగు సాహిత్య వేదిక
BTSV

## శ్రీ పరాభవ నామ సంవత్సర
## ఉగాది ప్రత్యేక సంచిక - 2026




CORE CARE CLINIC®
Primary Care and Behavioral Health
Massachusetts Locations
Waltham Clinic
6 Lexington Street, 3rd Floor,
Waltham, MA 02452
North Andover Clinic
451 Andover Street, Suite 206A,
North Andover, MA 01845
Comprehensive Care Across Two Convenient Locations
Appointments: 978-662-1002
appointments@corecareclinic.org
Same-day appointments available.
New patients welcome.
Accepting most insurance plans.


Mayuri
INDIAN CUISINE
Authentic North & South
Indian Cuisine
North & South Indian Menu
Wide variety of delicious dishes from across India.
Wide Variety of Jain & Vegan Dishes
Traditional Jain-friendly and vegan options.
Lunch Specials – Monday to Saturday
Tasty lunch specials at a great price.
Grand Sunday Buffet (Lunch)
GRAND SUNDAY BUFFET | $20.95 | Kids $15.95
12 PM - 3 PM
Private Party Hall – Up to 40 Guests
Ideal for birthdays, gatherings & celebrations.
Special Menu for Poojas &
Traditional Ceremonies
Custom catering for religious & cultural events.
Westborough, MA
Reservations • Catering • Event Bookings
• 508-366-3777 •

# సంపాదకీయం

అమెరికాలో, దేశ స్థాయిలోనూ, స్థానికంగానూ ఇన్ని సాహిత్య సంస్థలుండగా, ఇప్పుడీ మరొక సాహిత్య సంస్థ అవసరమేమిటి? అనే ప్రశ్న రావచ్చు. రావాలి కూడా. ఆ ప్రశ్నకి ఒక్క వాక్యంలో సమాధానం చెప్పాలంటే - తెలుగు వారెక్కడుంటే అక్కడో సాహిత్యవేదికకి ఆస్కారముంది. ఈ సమాధానంతో సంతృప్తి చెందకపోయినట్టయితే మరి కొంత కూలంకషంగా పరిశీలించవలసిన అవసరం ఉంది.

మన మనసులోని భావాల్ని ఒక కథగానో, కవితగానో, పాటగానో, వ్యాసముగానో లేక డైరీలో పదిలపరుచుకునే జ్ఞాపకంగానో... ఎలాగైనా సరే ఒక రూపాన్నివ్వడమే సాహిత్యం. అమ్మమ్మ చెప్పిన కథలూ, మాష్టారు వల్లెవేయించిన శతకాలూ, నాన్న చెబుతూ ఉండే సామెతలూ...ఇవన్నీ సాహిత్య రూపాలే. అలా సాహిత్యం మన జీవితాల్లో ఒక భాగంగా ఉండేది, ఉంది, ఉండబోతోంది కూడా! ఉత్తమ సాహిత్యం, మనల్ని మన పరిధులని దాటించి, కొత్త గమ్యాలకి చేరుస్తుంది. మనము వెళ్లని, వెళ్లలేని ప్రపంచాలని మనకి పరిచయం చేస్తుంది. తద్వారా మనలోని సృజనని మేల్కొలిపే ప్రయత్నమూ చేస్తుంది. సాహిత్య పఠనం, లేఖనం సమాజాన్ని మనకి మరింత దగ్గర చేస్తుంది. మనుషుల్లోని మంచితనాన్నీ, సంశయాన్నీ, చేతకానితనాన్నీ, సాహసాన్నీ, డొల్లతనాన్నీ...కొత్త కోణాల్లోంచి ఆవిష్కరిస్తుంది. జీవితాన్ని ఇంతగా ప్రభావితం చెయ్యగలిగే శక్తి కలిగిన సాహిత్యాన్ని ముందుతరాలకి మనదైన తెలుగుభాషలో పరిచయం చెయ్యాలనే మా ఈ వేదిక ముఖ్య లక్ష్యం.

దీనికి ముందుగా ప్రస్తుత తెలుగు సాహిత్య ప్రపంచాన్ని విహంగ వీక్షణం చేయవలసిన అవసరం కొంత ఉంది.

గత దశాబ్దాలలో, మన సాహిత్యం పరిమాణంలోనే కాక వివిధ సాహిత్య రూపాలలో కూడా చాలా విస్తృతిని సాధించగలిగింది. నవల, నవలిక, కథానిక, గల్పిక, వచన కవిత్వం, పద్య కవిత్వం, కావ్యం, గేయం, వ్యాసం, జీవితచరిత్ర, నాటిక, విమర్శలతో పాటుగా, మైక్రో ఫిక్షన్, హైకూలు, నానీలు, సోషల్ మీడియా కథలు, వెబ్ సీరియల్స్ వంటి కొత్త ప్రయోగాలనీ, సాహిత్య అనుకరణలనీ అక్కున చేర్చుకుంటూ, తెలుగు సాహిత్యం నానాటికీ కొత్త దారులని ఏర్పరుచుకుంటోంది. ఒక్క రూపంలోనే కాకుండా, భావవ్యక్తీకరణలోనూ విభిన్నంగా ముందుకు వెళుతోంది. గత రెండు దశాబ్దాలలో విరివిగా వచ్చిన అస్తిత్వవాద, స్త్రీవాద రచనలూ, పలువురు రచయితలు చేస్తున్న మాండలిక ప్రయోగాలూ అందుకు మంచి ఉదాహరణలు.

రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న రచయిలతో పాటు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు డయాస్పోరాలో కూడా మంచి రచయితలూ, కవులూ, వ్యాసకర్తలూ ఇప్పుడు మనకి ఉన్నారు. ఒక్క నార్త్ అమెరికాలోనే సాహితీ సమేవేశాలు జరిగినప్పుడు వందకి పైగా సాహిత్యకారులు కలిసిన పలు సందర్భాలూ ఉన్నాయి.

కాకపోతే, ఎంతమంది వస్తున్నా, ఎన్ని చేస్తున్నా, తెలుగు కథకీ, కవిత్వానికీ, నవలకీ కాలం చెల్లిందనే అనుమానాలూ, పాఠకుల ఆదరణ నానాటికీ తగ్గుతోందనే వాదనలూ... తిరిగి ఆ వాదనలకి సవాళ్ళూ, ఖండనలూ సామాజిక మాధ్యమాలలో విరివిగా వినిపిస్తూనే ఉన్నాయి. తెలుగువారు మూవీలూ, వెబ్ సిరీసులూ, రీల్స్ కే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తూ, పుస్తకాలని చదివే సమయం తగ్గించారన్న మాట మాత్రం వాస్తవం. ఈ మధ్యనే వస్తున్న కొత్త నవలలతో, వినూత్నంగా నిర్వహిస్తున్న సాహిత్య మీటప్ లతో, డిజిటల్ యాప్స్ తో, 'చదవడం' మళ్ళీ ట్రెండ్ గా మారిందనే కనిపిస్తోంది. ఆ తిరిగొచ్చిన సాహిత్య వసంతానికి, మా బోస్టన్ తెలుగు సాహిత్య వేదిక కూడా తప్పక తోడుగా నిలవాలనేదే మా ఆశయం.

చివరిగా, ఏ పుట్టలో ఏ పాముందో తెలియనట్టుగా, ఎవరిలో ఏ సాహిత్య ప్రతిభ ఉందో తెలియకపోవచ్చు. ఇలాంటి వేదికల ప్రోత్సాహం ద్వారా హఠాత్తుగా మనకి మరో చలమో, తిలక్కో, చాసోనో దొరికితే, అది తెలుగుజాతి అదృష్టమే కదా!

**నమస్సులతో...**


**పాణిని జన్నాభట్ల**

**మెసాచుసెట్స్, యూ.ఎస్.ఎ**

# విషయ సూచిక


| క్ర.సం. | వ్యాసం/కథ/కవిత పేరు | రచయిత | పుట సంఖ్య |
|---|---|---|---|
| 01. | అధ్యక్షురాలి సందేశం | దీప్తి గోరా | 03 |
| 02. | అక్షర శుభాకాంక్షలు | కిరణ్‌ప్రభ | 04 |
| 03. | అమెరి'కెలికింగ్' కథ | వంగూరి చిట్టెన్ రాజు | 05 |
| 04. | ఒక చిన్ననాటి జ్ఞాపకం | గిరిధర్ పొట్టేపాళెం | 07 |
| 05. | ఆ అయిదు మాటలే మళ్ళీ | అఫ్సర్ | 10 |
| 06. | మేధా మాయా వాణాస్త్రం | పద్మజ బలభద్రపాత్రుని | 11 |
| 07. | ధ్యానం - హైకూలు | భాస్కర్ పులికల్ | 14 |
| 08. | నా ఇండియా ప్రయాణం | ఋత్విక్ శర్మ వారణాసి | 15 |
| 09. | అర్ధనారీశ్వరం | శ్రీనివాస్ బలభద్రపాత్రుని | 16 |
| 10. | పదవినోదం | BTSV టీం | 18 |
| 11. | నన్నెచోడుని పద్య సౌరభం | గార రంగనాథం | 19 |
| 12. | ఛిద్రం వినా కుడ్యం | శ్రీనివాస్ బారు | 22 |
| 13. | ఆహ్వానం పలుకుదాం | డా॥ మైలవరపు లలితకుమారి | 24 |
| 14. | తృష్ణాతీరం | కావ్య అక్కినేపల్లి | 25 |
| 15. | వలసపక్షులు | మురళి పసుమర్తి | 28 |
| 16. | ఏ.ఐ - శక్తా?, శాపమా? | సిద్ధార్థ వింజామరం | 29 |
| 17. | తండ్రి మీద రెండు పద్యాలు | తమ్మినేని యదుకుల భూషణ్ | 31 |
| 18. | మార్పు | విన్నకోట రవిశంకర్ | 31 |
| 19. | స్వస్వరూపం | శ్రీనివాస్ బారు | 31 |

# అధ్యక్షురాలి సందేశం

*భాషాభిమానులందరికి అక్షర అభివాదం.*

బోస్టన్ తెలుగు సాహిత్య వేదిక లక్ష్యం, తెలుగు భాష వాడుకని ప్రోత్సహించడం. అంటే తెలుగు వినడం, చదవడం, రాయడం ప్రోత్సహించడం. శక్తి వంచన లేకుండా తరతరాల తెలుగు సాహిత్యాన్ని సంరక్షిస్తూ, విస్తృత వ్యాప్తి చేస్తూ ముందు తరాల వాళ్ళకి అందుబాటులోకి తీసుకొని రావడం. ఏ ఇజానికి ఏ చట్రానికి పరిమితం కాకుండా సృజనాత్మకతతో వీలైనంతగా అందరిని కలుపుకొని భిన్న దృక్పథాలు, ఆలోచనలు ప్రతిబింబించేలా ముందుకు సాగడం.

ప్రవాసం ఒక ప్రహసనం. జీవనోపాధికో, మెరుగైన జీవితానికో, ప్రపంచాన్ని శోధించడనికో లేదా మనల్ని మనం పరిశోధించుకోవడానికో... కారణం ఏదైనా, రెక్కలు కట్టుకున్న ఆశయాలతో, కోటి కలలు నింపుకున్న కళ్లతో మనది కాని దేశంలో మనదైన ప్రతిభతో గెలవడానికి అడుగుపెట్టాం. ఈ క్రమంలో దైనందిన జీవితంలో, జీవన సంఘర్షణలో, ఎదుగుదలలో మనతనాన్ని అనునిత్యం గుర్తుకుతెచ్చేది మనభాషే. మన మూలలకి మనల్ని కలిపి ఉంచే ఒక అంతః సూత్రం, మన మాతృభాష.

నా భాష గొప్ప. నా భాషే గొప్ప. ఈ రెండు అభిప్రాయాల్లో చాలా అంతరం ఉంది. అభిమానానికి, దురాభిమానానికి మధ్య సన్నటి గీతలా. తన ఉనికిని కోల్పోకుండా నలుగురిని కలుపుకుని వెళ్లడం, భిన్న అనుభవాలని, అనుభూతుల్ని, సంస్కృతులని తనలో మమేకం చేసుకొని ముందుకు వెళ్లడం ఉదారతకి, ఎదుగుదలకి ప్రమాణం. ఈనాటి ఆధునిక సమాజంలో, ముఖ్యంగా సాంకేతికత వల్ల ఎల్లలు చెరిగిపోయిన ఈ తరంలో ఈ వైఖరి ఎదుగుదలకే కాదు ఉనికికి కూడా అవసరం.

బోస్టన్ తెలుగు సాహిత్య వేదిక తెలుగు సాహిత్యం లో తరాల అంతరాన్ని తగ్గించే భాషా సంస్కృతికి వారధిలా, భిన్న స్వరాలు సంగమించే జలధిలా, భాషాభిమానులను అనుసంధాన పరిచే ఒక చక్కని వేదిక కావాలని ఈ ప్రయత్నం.

భాష అంటే కొందరికి తమ భావాలను వ్యక్తం చేసే ఒక సాధనం కావచ్చు. మరికొందరికి తమ అస్తిత్వానికి గుర్తింపు కావచ్చు. చాలా సంస్థలు, భాష కోసం పాటుపడే సంఘాలు, కూటములూ ఉన్నా భౌతికంగా మనకి దగ్గరలో అందుబాటులో వుంటూ, చదువరులను, శ్రోతలను, రచయితలను క్రమానుగతంగా క్రియాశీలకంగా పాల్గొనేలా చేస్తే మరింత ప్రభావవంతంగా వుంటున్దని నా ఉద్దేశం. ప్రకాశవంతమైన నక్షత్రం కూడా దూరంగా ఉంటే మిణుకు మిణుకుమంటూనే కనిపిస్తుంది.ఆ దూరం దగ్గర అయితే దాని మిరిమిట్లు కొలిపే వెలుగు మనల్ని ఎంతో తేజోవంతులుగా నిలుపగలదు కదా.

మాతృ భాష అంటే, తెలుగు మాట అంటే

నన్నయ తిక్కన పెద్దన విశ్వనాధులు సమకూర్చిన బాట
శ్రీశ్రీ విసిరిన ఘాటైన చురకల తూట
చలం సంచలన ప్రభంజనమట
అంతేనా...
తెలుగంటే, పైర గాలి చల్లదనం
వేదంల్లా ఘోషించే గోదారి గాంభీర్యం
వెచ్చని అమ్మవడి లాలిత్యం
తెలుగంటే, సప్త సముద్రాలు దాటిన ఇంకిపోని గుండెల్లో తడి
భాషా తప్త హృదయాల సవ్వడి
మాతృభాషని మృతభాష కానివ్వకు
మాతృభాష అంటే, తెలుగు మాట అంటే
భావితరాలకి మనం అందించగల పారంపరిక సంపదల గని
తెలుగుని నిత్యం వెలగని జగమంతా వెల్లివిరియనీ

**దీప్తి గోరా**

**వ్యవస్థాపక అధ్యక్షురాలు**

**మెసాచుసెట్స్, యూ.ఎస్.ఎ**

# బోస్టన్ తెలుగు సాహిత్య వేదిక ఆవిర్భావం

## అక్షర శుభాకాంక్షలు

**ప్రియమైన బోస్టన్ సాహితీ మిత్రులకు,**

కాలిఫోర్నియా పసిఫిక్ తీరపు వెచ్చని గాలుల సాక్షిగా, బోస్టన్ మంచు తుంపరల మధ్య 'తెలుగు అక్షరానికి' పట్టాభిషేకం చేస్తున్న సాహితీ మిత్రులందరికీ హృదయపూర్వక అభినందనలు.

మనం భౌతికంగా మన మాతృభూమికి వేల మైళ్ల దూరంలో ఉండవచ్చు, కానీ మన ఆలోచనలు, మన కలలు, మన ఆశలు, మన అన్వేషణలు, మన వేదనలు ఇప్పటికీ ఆ 'అమ్మ' భాషా పరిమళంలోనే సేదతీరుతుంటాయి. మనందరికీ తెలుసు - "భాష కేవలం భావ ప్రకటనా సాధనం కాదు, అది మన అస్తిత్వపు మూలం." ఈనాడు మీరు స్థాపించబోతున్న 'బోస్టన్ తెలుగు సాహిత్యవేదిక' కేవలం ఒక సంస్థ కాదు; అది మన మూలాల్ని వెతుక్కుంటూ మనం వేస్తున్న ఒక బలమైన ముందడుగు..

బోస్టన్ వంటి వైజ్ఞానిక, మేధో నగరంలో ఈ వేదిక కార్యకలాపాలు ప్రారంభించడం అభినందనీయం. తెలుగు సాహిత్య ప్రపంచం పుష్పకవిమానం లాంటిది. ఎంతమంది రచయితలు వస్తున్నా, ఇంకా కొత్తవారికి ఎప్పుడూ స్థానం ఉంటుంది. ఎన్ని సాహితీ సంస్థలు కొనసాగుతున్నా, కొత్త సంస్థలకు అవకాశం ఉంటుంది. గత ముప్తై ఏళ్ళుగా అమెరికాలో ఎన్నో సాహితీ సంస్థల కార్యకలాపాలను దగ్గరగా గమనించిన అనుభవంతో కొన్ని ఆలోచనలు పంచుకుంటాను.

ప్రవాస సాహిత్యం - ఒక కొత్త గొంతుక: మనం అమెరికాలో ఉంటూ కేవలం ప్రాచీన కావ్యాలనో లేదా కేవలం ఆధునిక సాహిత్యాన్నో నెమరువేసుకుంటే సరిపోదు. మనకు అన్ని కాలాల, అన్ని వర్గాల, అన్ని కోణాల సాహిత్యమూ అవసరమే. ఇష్టా, ఇష్టాలనేవి తరువాతి సంగతి. నచ్చిన సాహిత్యంతో బాటూ, నచ్చని రచనలను కూడా తప్పక చదవాలి. ఇది కొంచెం విచిత్ర వాదనలా ఉంటుందేమో, కానీ మనకు నచ్చని కథలనుంచి, నవలలనుంచి, వ్యాసాలనుంచి ఎక్కువ నేర్చుకునే అవకాశముంటుంది. వీటన్నింటినీ మించి- ఇక్కడి జీవన పోరాటాన్ని, ఈ నేల మనకు నేర్పిన పాఠాలను, రెండు సంస్కృతుల మధ్య నలిగే మన అంతరంగాన్ని కొత్త సాహిత్యంగా మలచాలి. 'డయాస్పోరా' సాహిత్యంలో తెలుగు సంతకం ప్రపంచ స్థాయికి చేరాలి.

అనువాద వారధులుగా మారదాం: ఇక్కడ పుట్టి పెరుగుతున్న మన తరువాతి తరం బిడ్డలకు తెలుగు ఒక 'పరీక్ష' కాకూడదు, అదొక 'అనుభూతి' కావాలి. పాశ్చాత్య దేశాల్లో ఉన్న గొప్ప సాహిత్య విలువలను తెలుగులోకి, అలాగే మన తెలుగు సాహిత్యంలోని మాధుర్యాన్ని ఆంగ్లంలోకి అనువదించే 'అక్షర వారధులుగా' మనందరం ఎదగాలి.

సంపాదక దృక్పథం: సాహిత్యం ఎప్పుడూ సమాజాన్ని ప్రతిబింబించాలి. మీ వేదిక ద్వారా యువతను, కొత్త రచయితలను ప్రోత్సహించండి. అక్షరం పదును తగ్గకుండా, ఆధునిక పోకడలను ఆహ్వానిస్తూనే మన సంప్రదాయ విలువలను కాపాడే ఆలోచనా మార్గంలో కొత్త సంస్థను ముందుకు తీసుకువెళ్ళండి.

బోస్టన్ నగరం విజ్ఞానానికి చిరునామా, ఇప్పుడు మీ కృషితో అది తెలుగు సాహిత్యానికి కూడా ఒక గొప్ప వేదిక కావాలి. అక్షరం ఎప్పుడూ ఒంటరిది కాదు; అది మనందరినీ కలిపే ఒక మహాశక్తి. ఈ వేదిక ద్వారా మరిన్ని మంచి పుస్తకాలు, గోష్టులు, కవితలు రూపుదిద్దుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

మీ అడుగులు అక్షర దిశగా.. మీ లక్ష్యాలు శిఖర దిశగా సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ...

**కిరణ్‌ప్రభ**

సంపాదకుడు - కౌముది అంతర్జాల మాసపత్రిక

కాలిఫోర్నియా

మార్చి 3, 2026

# అమెరి'కెలికింగ్' కథ

**వంగూరి చిట్టెన్ రాజు**

**హ్యూస్టన్, టెక్సస్, యూ.ఎస్.ఏ**

దేవుడు అయినా, దేవత అయినా భలే తెలివైన వాళ్ళు. ఎందుకంటే తను పుట్టించిన ప్రతీ జాతికీ ఏదో ఒక ప్రత్యేక లక్షణం, అవలక్షణలాతో 'తాంబూలం ఇచ్చేసి' తమలో తాము నవ్వుకుంటారు. ఉదాహరణకి మలయాళీలు, ఇజ్రాయిల్ వాళ్ళూ జాతికి లక్షణమైనది వ్యాపారం కాబట్టి చంద్ర గ్రహం మీద కూడా టీ కొట్టు, బంగారం షాపులూ పెట్టగలరు. హమాస్, టాలిబాన్ లాంటి వాళ్ళకి ఉగ్రవాదం అయితే గంటకో గ్లాసు వోడ్కా తాగి పక్క దేశాలని ఆక్రమించడం రష్యా వాళ్ళ లక్షణం. ఇక మన పవిత్ర భారతీయులకి నిజాయితీగా బతకడం గురించి నీతులు చెప్పడం, ఆమ్యామ్యాలు, 'మేనేజ్ మెంట్ ఖర్చులు' ఇవ్వకుండా, పుచ్చుకోకుండా అస్సలు బతకలేక పోవడం పురాణ కాలం నుంచీ ఉన్న ఒక అవలక్షణం. ఇక తెలుగు జాతి అంటారా? ప్రపంచంలో ఏ ఖండంలో ఉన్నా, మరీ ముఖ్యంగా మా అమెరికాలో ఉన్న తెలుగు వారి జాతి లక్షణం అమెరి'కెలికింగ్'...

అమెరికెలికింగ్ అనగా... అవసరం ఉన్నా లేక పోయినా, అడిగినా అడగక పోయినా, తనకి ఏ మాత్రం సంబంధం లేని విషయం అయినా సరే...పని కట్టుకుని కెలకడం అనమాట. అది భార్యాభర్తల మధ్యే అయితే అది 'కిచెన్ కెలికింగ్', 'పడక గది కెలికింగ్', కిరాణా కొట్టు కెలికింగ్", పెళ్ళాం కెలికింగ్, మొగుడు కెలికింగ్... ఇద్దరూ కలిసి మెలిసి జాయింట్ గా పిల్లల కెలింగులూ... ఇలా అనేక రకాలుగా ఉంటాయి. ఉదాహరణకి మొన్నీ మధ్య నా మానాన నేను సరదాగా ఏదో వంట చేద్దాం అని కిచెన్ లోకి వెళ్ళీ వెళ్ళగానే ఎక్కడి నుంచో మా క్వీన్ విక్టోరియా రివ్వుమని దూసుకు వచ్చి "ఇక్కడేదైనా కెలికావంటే, చూసుకో" అని తన అందమైన చూపుడు వేలుని వెయ్యి మైళ్ళ స్పీడు లో దడ దడ లాడించింది. అదన్నమాట అమెరి కిచెన్ కెలికింగ్ అంటే...నిజానికి అప్పుడు నేను ఇంకా బంగాళ దుంపలు తొక్కు కూడా తియ్య లేదు. అలాంటిది ఇక ఉల్లిపాయలు కూడా తరిగితే ఎంత కొంప మునిగేదో కదా! ఇక వారం, వారం గ్రోసరీ షాపింగ్ లిస్ట్ రాయడం ఆవిడ వంతు అయితే కూరల మార్కెట్, కిరాణా కొట్టు, అశ్వగంధతో సహా మందులూ, గడ్డీ గాదం, దుప్పట్లూ, చేపలు పట్టు సామానూ, బూట్లూ, కంప్యూటర్లూ... ఇలా అన్నీ ఒకే చోట దొరికే వాల్ మార్ట్‌కి వెళ్ళి అవి కొనుక్కురావడం నా పెళ్ళినాటి ప్రమాణాలలో ఒకటి. అయితే ఆ సంచులన్నీ మోసుకుని నేను ఇంట్లో అడుగుపెట్టగానే తను ప్రతీ సంచీ లోనూ ముందు వేలుతో చిన్న కెలుకుడూ, తర్వాత వాటిని బయట పెట్టి కూలంకష కెలకుడూ మొదలు పెడుతుంది. ఎందుకనగా....తను లిస్ట్‌లో రాసినవాటికన్నా నేను ఏ ఒక్క ఐటెమ్ ఎగస్ట్రాగా పట్టుకొచ్చినా అంతే సంగతులు. కిందటి వారం ఆవిడ లిస్ట్ లో "దొండ కాయలు-23, "ఉత్తి వంకాయలు-6", మాత్రమే" అని రాసిందే అనుకోండి... నేను దొండకాయలు నాకు అంత 'ఇసటం' లేదు కదా అని 23 బదులు 21 తీసుకొస్తే .."వెధవ 21 ఈ బుల్లి వి ఏం చేసుకోనూ, ఒక పూటకి కూడా సరిపోవు" అనీ, ఆవిడ పొరపాటున రాసినది ఉత్తి కానీ అది గుత్తి కదా అనుకుని ఎందుకైనా మంచిది అని పెద్ద వంకాయలు ఏడు తెస్తే, "ఏకంగా ఇంత పెద్దవి తెస్తే నీ బాబు వండుతాడా? అనీ మా తండ్రిగారిని గుర్తు చేసుకుని మా క్వీన్ విక్టోరియా విసిరి కొట్టును. నేను మళ్ళీ వాల్ మార్ట్ కి వెళ్ళి, ఒక పెద్ద వంకాయ రిటర్న్ చేసినప్పుడు, రెండే రెండు దొండ కాయలు కొంటున్నప్పుడు, అక్కడి సేల్స్ అమ్మాయిలు నా వేపు చూసిన చూపులు ఈ అమెరికా జన్మలో మర్చిపోలేను. ఈ కేటగిరీలు అన్నీ కలిపి "అమెరికొంప కెలికింగ్" అంటారు.

ఇక అమెరికాలో మన తెలుగు సంఘాల మాట కొస్తే, ఏ ఊళ్ళో అయినా సరే, వాటిలో సామూహికంగా, విషయం ఏదైనా సరే తప్పని సరిగా జరిగేది మరొక రకం కెలికింగ్. ఉదాహరణకి మొన్నీ మధ్య మా ఊళ్ళో ఒకాయనకి అమెరికొత్తాలోచన వచ్చింది. "ఇప్పటి దాకా మన తెలుగు సంఘానికి సేవ చెయ్యడానికి ఏడుగురు మాత్రమే కమిటీలో ఉంటే చాలు అని ఎప్పుడో యాభై ఏళ్ళ క్రితం అనుకున్నారు. అప్పుడు అలా అనుకున్న వారిలో వంగూరి గాడు ఒక్కడే

బతికున్నాడు. ఆ రోజుల్లో ఈమైలూ లేదు, ఫేస్ బుక్కూ లేదు, వాట్సాపూ లేదు. పాపం ఊళ్ళోనే ఉండి ఒకళ్ళకి ఒకరు పోస్ట్ కార్డు లో ఉత్తరాలు రాసుకుని, ఉగాది, సంక్రాంతి ప్రోగ్రాములు పెట్టుకునే వారుట. మరి ఇప్పుడు మన ఎడ్వాన్స్డ్ సమాజంలో పేటకి పది చొప్పున వాట్సాప్ గ్రూపులే వంద పైగా ఉన్నాయి కాబట్టి మన నిర్వాహక కమిటీలో తొమ్మిది మంది, ట్రస్టీలుగా ఐదుగురు ఉండేలా మన రాజ్యాంగం మార్చాలి". ఇదీ ఆయన అమెరికొత్తాలోచన. ఇహ చూసుకోండి, కెలుకుడే కెలుకుడు.

"మార్చవచ్చును కానీ దానికి ముందు మన రాజ్యాంగం, అనగా by-laws సవరించాలి కదా?" అని ఒక అమాయకెలికింగ్ తో ఈ వాట్సాప్ వేడి మొదలయింది. "బై లాస్ సవరించవచ్చు కానీ దానికి జనరల్ బాడీ మీటింగ్ పెట్టి, అందులో మూడో వంతు శాతం ఒప్పుకోవాలి కదా?" అని కొంచెం అమెరికోపం కెలికింగ్, ఆ తర్వాత ఇక ఒకరి తర్వాత ఒకరు విజృంభించి అమెరికోడికెలికింగ్, కొక్కొరొకో కెలికింగ్, పది మంది నుంచి పాతిక పైగా స్పెషల్ డీలక్స్, అర్ధరాత్రి, అపరాత్రి, పట్టపగలు మొదలైన ప్రక్రియలతో "అసలు నువ్వెవడివిరా, బచ్చా", "నీ జాతకం నాకు తెలుసు" లాంటి ప్రగాఢమైన ప్రవచనాలతో ఈ కెలికింగ్ పరంపర మాకు చాలా వినోదం పంచిపెట్టి కళ్ళమ్మట నీళ్ళు తెప్పించింది. అమెరికా తెలుగు సంఘాలలో ఇలాంటి వాటిని 'అమెరి కులకెలికింగ్' అంటారు. అంటే ఆవు వ్యాసం లాగా అసలు విషయం ఏదైనా సరే....ఆఖరికి అందరూ కులకెలికింగ్‌లో భాగస్వాములే. ఉదాహరణకి ఏదో పెద్ద పెద్ద మనిషిలాగా నేను "అసలు మొట్టమొదట ఆ బై లాస్ నేను తెలుగులో రాశాను...కేవలం పది వాక్యాలు. అవి ఎవరైనా చదివారా" అని ఈ కెలికింగ్ పరంపరలో పొరపాటున తల దూర్చానే అనుకోండి. అప్పుడు అది 'అమెరికరణం కెలికింగ్" అవుతుంది అన్నమాట. అలాగే మిగతావి ఆయా కులాల వారీగా అమెరికమ్మ కెలికింగ్, అమెరెడ్డి కెలికింగ్, అమెరికోమటి కెలికింగ్...ఇలా ఎవరి పరిధుల్లో వారు విహరిస్తూ ఉంటారు. అలా అని ఎప్పుడైనా వాట్సాప్‌లో కాకుండా ఏదైనా ఉగాది కార్యక్రమం లోనో కలుసుకున్నప్పుడు అమెరికావలించుకుని అన్నీ మర్చిపోతాం. పేకాట పేకాటే, బామ్మరిది బామ్మరిదే! ముందే చెప్పానుగా... తెలుగు జాతి లక్షణం...అమెరికాలో 'అమెరికుల కెలికింగ్'. యునైటెడ్ కింగ్ డమ్ లో 'బ్రిటన్ కెలికింగ్' ఇలా...ఆయా దేశాలలో ఆయా కెలికింగ్ ప్రక్రియలు నిరాఘాటంగా కొనసాగుతూ ఉంటాయి. అన్నింటికీ మూలం.. 'తెకోరాకకెలికింగ్'... అనగా.. తెలంగాణా, కోస్తా, రాయల సీమ, కళింగ కెలికింగ్..లు అనమాట. ఖండ ఖండాలలో మన సంస్కృతిని పాటించడం అనమాట.

చివరిగా....మా ప్రపంచవ్యాప్తంగా కెలికింగ్ కింగ్ గా నొబెల్ బహుమతి అందుకునే అర్హత ఉన్న ఏకైక వ్యక్తి మా డానల్డ్ ట్రంప్ గారే...ఆ అమెరికోతి గారి కొబ్బరి చిప్ప పేరు 'టారిఫ్".. ప్రపంచంలో ప్రతీ దేశాన్నీ అమెరికెలికింగ్ చేసి పారేస్తున్న ఈ టారిఫ్ అనే అమెరికొబ్బరి కెలికింగ్ కి మొన్నీ మధ్య మా అమెరికా సుప్రీంకోర్ట్ వారు తోలు వలిచి ఆ ఆటకి అడ్డుకట్ట వేశారు...వేశాం అనుకున్నారు కానీ ఇప్పుడు ట్రంప్ గారు అదే టారిఫ్ విషయాలలో అమెరికాంగ్రెస్ తో ఇంకెవరూ కెలక్కుండా కొత్త పద్ధతులలో ఇంకాస్త ఎక్కువగా విజృంభిస్తారు అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. పులి రక్తం మరిగింది కదా. మిగతా వన్నీ ఎలా ఉన్నా..."రష్యా-యుక్రెయిన్ యుద్ధం మొదటి రోజునే ఆపేస్తాను" అని ప్రగల్భాలు పలికిన ట్రంప్ గారి కెలుకుడు ఇంకా ఎక్కడ వేసిన గొంగళీ గానే ఉంది. పుటిన్ గారు యుక్రెయిన్ ని కెలకడం ఆపనే లేదు.

అనవసరంగా కెలకడం మానవ జాతికి మాత్రమే ఉన్న లక్షణం...అవునంటారా? కాదంటారా?

# “కాలం కూడా సమాధానం చెప్పలేని ప్రశ్న”

## ఒక చిన్ననాటి జ్ఞాపకం

(ఉగాది సాహిత్య పోటీలో ప్రశంసాపత్రం పొందిన వ్యాసం)

గిరిధర్ పొట్టేపాళెం
మెసాచుసెట్స్, యూ.ఎస్.ఎ

**కాలమే** అన్నిటికీ సమాధానం – ఇది పాత నానుడే, అయినా తరచూ కొత్తగా వినేదే. అయితే, కాలం సమాధానం చెప్పలేని ప్రశ్న ఉంటుందా అంటే – ఖచ్చితంగా ప్రతి ఒక్కరి జీవితంలో ఏదో ఒకటి ఉండే ఉంటుంది, కాలం కూడా ఎప్పటికీ సమాధానం చెప్ప(నే)లేని ప్రశ్నగా మిగిలిపోయే ప్రశ్న.

నా జీవితంలో అలా ప్రశ్నగా మిగిలిపోయిన ఒక చిన్న నాటి జ్ఞాపకం, 49 ఏళ్ళ నాటి నా రెసిడెన్షియల్ స్కూల్ రోజులది. ఐదవ తరగతి లో “ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయం, కొడిగెనహళ్ళి, అనంతపురం” పాఠశాలకి ప్రవేశ పరీక్షల ద్వారా రాయలసీమ నాలుగు జిల్లాలు, నెల్లూరు కలిపి ఐదు జిల్లాల పోటీలో తాలూకా స్థాయి దాటి, జిల్లా స్థాయిలోనూ నెగ్గి, నెల్లూరు జిల్లా నుంచి ప్రవేశం పొందిన నేను తొమ్మిదేళ్ళ వయసులో ఇల్లు వదలి ఆరేళ్ళ గురుకుల విద్యాభ్యాసానికి వెళ్ళాల్సి వచ్చింది. మా ఊరు “కావలి” కి చాలా దూరం, దాదాపు 400 కిలోమీటర్లు. మూడు బస్సులు, లేదా రెండు రైళ్ళు మారి ఏ మార్గంలో వెళ్ళినా “హిందూపురం” చేరి, అక్కడి నుండి మూడు కిలోమీటర్లు బస్సో, జట్కా బండో పట్టుకుని చేరితే, అంతా కలిపి దాదాపు ఒక రోజు పట్టేంత దీర్ఘ ప్రయాణం. గురుకుల విద్యాలయం ఆవరణలోనే జీవనం ఉంటూ నాలుగు నెలలకొకసారి శలవులకి ఇంటికి వస్తూ ఆరేళ్ళు గడపటం ఎంతటి గగనమో తెలియని వయసది. అప్పటి దాకా ఇంటి వద్దే ఉంటూ చదివిన నాలుగేళ్ళ పాఠశాల అనుభవమేదీ అక్కడ ఉపయోగపడదు. అన్ని పనులూ మాకు మేమే చేసుకోవాలి. మా బాగోగులు చూసుకోవటానికి మాకు పాఠాలు చెప్పే అధ్యాపకులు కొందరు అక్కడే నివసిస్తున్నా, తరగతి గదుల్లో, వసతి గదుల్లో, ఆటల్లో, రోజంతా మిత్రులతోనే కలిసి మెలిసి జీవనం.

నాన్న “కావలి బాయ్స్ హైస్కూలు”లో టీచర్. గురుకుల విద్యాలయంకి పంపే ముందు నాకు అన్ని జాగ్రత్తలూ పూస గుచ్చినట్టు రోజూ చెప్పేవాడు, పొద్దున లేచిన దగ్గరి నుంచీ రాత్రి పడుకోబోయే దాకా నేనక్కడ ఎలా ఉండాలో. నిద్ర లేవగానే డ్రిల్ కి వెళ్ళే ముందు దుప్పటి మడిచి పెట్టుకుని, సాక్స్ బూట్లు వేసుకుని, చలి వేస్తే తప్పనిసరిగా స్వెటర్ తొడుక్కుని, చలిగాలి దూరకుండా జాగ్రత్తగా మెడకి టవల్ చుట్టుకుని చెవులు కప్పుకుని, డ్రిల్ అయ్యాక రూము కి వచ్చి బ్రష్ చేసుకుని, చన్నీళ్ళని వెనకాడకుండా స్నానం చేసి, నీట్ గా ఉతికిన స్కూల్ డ్రెస్ వేసుకుని, క్యాన్వాస్ షూస్ వేసుకుని, కొబ్బరి నూనె పెట్టుకుని చక్కగా తల దువ్వుకుని, ఆ రోజు టైమ్ టేబుల్ చూసుకుని పుస్తకాలన్నీ సర్దుకుని క్లాస్ కి వెళ్ళాలని, మధ్యాహ్నం భోజనం అయ్యాక ప్లేట్, గ్లాస్ శుభ్రంగా కడుక్కుని తుడిచి సూట్కేస్ లోనో, మంచం కింద పక్కన డ్రాయర్ లోనో పెట్టుకుని తాళం వేసుకుని మరలా క్లాసుకి వెళ్ళాలని...ఇలా ప్రతి చిన్న విషయమూ మరీ మరీ చెప్పి నన్ను పూర్తిగా సిద్ధం చేశాడు.

వారం వారం క్రమం తప్పకుండా ఇంటికి జాబు రాయాలని ఒక పాతిక పోస్టల్ కార్డులూ, ఇన్లాండ్ లెటర్లూ కొని, వాటన్నిటి మీదా మా ఇంటి అడ్రెస్ రాసి, సూట్ కేస్ లోఅన్నీ సర్ది, గుండ్రంగా అచ్చు గుద్దినట్టుండే నాన్న అక్షరాలతో నా సూట్ కేస్ లోపల పెన్ తో నా పేరు రాసి, నన్ను పూర్తిగా సిద్ధం చేసి, సరిగ్గా వెళ్ళే రోజు నాటికి తనకి స్కూల్ లో శలవు దొరకని కారణంగా నన్ను తాతయ్యతో స్కూలుకి పంపించాడు. నాన్న చెప్పినవన్నీ అలాగే పాటిస్తూ మొదటి విడత దసరా శలవులదాకా కొత్త అనుభవాలతో తెలియకుండానే మూడు నెలలు గడిచిపోయాయి.

మొదటి సారి దసరా శలవులకి ఇంటికి వచ్చినపుడు నాకు స్కూల్ లో రోజూ ఉదయం పాలు, గుడ్డు ఇచ్చినట్టే ఇంట్లోనూ అదే పాటిస్తూ ఆ అలవాటు తప్పనివ్వలేదు.

శలవులయ్యాక నన్ను స్కూల్ కి తీసుకెళ్ళి వదలి వచ్చాడు. నాన్నతో కలిసి నేను చేసిన సుదీర్ఘ ప్రయాణం అదొక్కటే. క్వార్టర్లీ పరీక్షలు రాసి శలవులకి వెళ్ళి వచ్చిన మాకు ఆన్సర్ పేపర్స్ దిద్ది, మార్కులు ఇచ్చి, ర్యాంకులు కూడా ఇచ్చారు. 36 మందున్న మా క్లాస్ లో నా ర్యాంక్ 20. ర్యాంక్ అన్న మాట వినటం అదే మొదటిసారి. కొద్ది రోజులకి ప్రోగ్రెస్ కార్డుపై నాన్న సంతకం చేసి పంపిస్తూ రాసిన జాబులో "ఈ పరీక్షల్లో నీకు 20వ ర్యాంక్ వచ్చింది, అంటే సగానికి పైగా, 19 మంది, నీకన్నా ముందున్నారు. బాగా చదివి మొదటి మూడు ర్యాంకుల్లో ఉండేటట్లు చూసుకొనవలసినది", అని చదివేదాకా ఎంత వెనకబడ్డానో అర్థం కాలేదు. హాఫ్ యియర్లీ పరీక్షల్లో నా ర్యాంక్ 18 వచ్చింది. అప్పుడు నాన్న రాసిన జాబులో "ఈసారి నీ ర్యాంక్ కొంచెం మెరుగయ్యింది. ఫస్ట్ ర్యాంక్ కై బాగా కృషి చెయ్యవలసినది." అని చదివిన మనసు చిన్నబోయింది, నాన్న కోరిక తీర్చలేక పోతున్నానని. దానికి ముందు "కావలి" గోపాలరావు సార్ "విద్యా భారతి" బడిలో నాకే అందరికన్నా ఎక్కువ మార్కులు వస్తూ అన్ని సబ్జక్ట్స్ లో క్లాస్ లో నేనే ముందుండేవాడిని.

ఐదవ తరగతి యాన్యువల్ పరీక్షలు రాసి, ఎండాకాలం శలవులకి వచ్చేముందు "ఒకవేళ బస్టాండుకి ఎవరూ రాకపోతే కావలి బస్టాండులో బస్సు దిగి పాతూరు కలుగోళ్ళమ్మ రాయి దగ్గర అని చెప్పి రిక్షా అర్ధరూపాయికి మాట్లాడుకుని రిక్షాలోనే ఇంటికి రావల్సింది, నడిచి రావొద్దు" అని జాబు రాశాడు. నాన్నకి అప్పటికే ఆరోగ్యం బాగాలేక "క్యాన్సర్" తో మద్రాస్ హాస్పిటల్ లో ఉన్నాడని అంతకు ముందు ఒక నెలగా ప్రతి జాబు లో "నాకు ఆరోగ్యం బాగై నువు శలవులకొచ్చేసరికి ఇంటికి వచ్చేస్తాను. నువ్వేమీ దిగులు పడొద్దు." అని రాసిన జాబుల ద్వారా తెలుసు. అయితే క్యాన్సర్ అంటే ప్రాణాంతకమైందని మాత్రం తెలీదు. జాబు వెనక అడ్రెస్ కూడా మద్రాస్ దే ఉండేది. ఆరోజు నాకోసం బస్టాండుకి ఎవరూ రాలేదు. నాన్న జాబులో రాసినట్టే రిక్షా మాట్లాడుకుని ఇంటికి వస్తే ఇల్లు తాళం వేసి ఉంది. ఏమీ అర్థం కాక నా ఎయిర్ బ్యాగ్ పక్కన పెట్టుకుని మెట్ల మీద చాలా సేపు కూర్చునే ఉన్నా. చివరికి ఏడుస్తూ అలానే కూర్చుని ఉన్న నన్ను ఎవరో చూసి పక్కింటి "చంచప్ప" కి చెప్తే ఆమె వచ్చి, ఇంట్లో ఎవరూ లేరని, అమ్మ కూడా మద్రాస్ లోనే ఉందని చెప్పి నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళింది. ఒకటే ఏడుపు, ఎంతో బ్రతిమిలాడితే కానీ అన్నం తిన్నా. ఏడుపు ఆపని నన్ను వాళ్ళబ్బాయితో మా బంధువుల ఇంటికి పంపింది. అక్కడికెళ్ళాక కానీ నాకు పరిస్థితి పూర్తిగా అర్థం కాలా. నాన్నతోబాటు అమ్మ, అమ్మమ్మా మద్రాసులో రూమ్ తీసుకుని ఉన్నారని, నాన్న మాత్రం హాస్పిటల్ లోనే ఉంటున్నాడని. రోజూ అమ్మ, అమ్మమ్మ అన్నం, పళ్ల రసం నాన్నకి తీసుకెళ్తున్నారని. అన్న మాత్రం "కందుకూరు"లో తాతయ్య వాళ్ళ దగ్గరున్నాడని, చెల్లెలు బామ్మ దగ్గర ఉందని. ఇవన్నీ విని ఇంకా ఏడుపెక్కువయ్యింది, నన్ను అన్న దగ్గరికి ఇప్పుడే తీసుకెళ్ళండి అని పట్టుబట్టా. అప్పటికి చీకటి పడుతూ ఉ ండడంతో ఎలాగోలా నాకు సర్ది చెప్పి తెల్లవారగానే తీసుకెళ్తామని ఒప్పించారు. తర్వాత రోజు "కలగయ్యన్న" నన్ను "కందుకూరు" కి తీసుకెళ్ళి అక్కడ వదలి వచ్చాడు.

అలా అమ్మ, నాన్నలతో గడపకుండానే ఆ వేసవి శలవులు గడిచిపోయాయి. ఆ శలవుల్లో ఒకరోజు తాతయ్య నన్నూ, అన్ననీ రైల్లో "మద్రాస్" తీసుకెళ్ళాడు. అప్పుడు పొద్దున్నే "విజయా నర్సింగ్ హోమ్" లో పేషంట్ విజిటింగ్ అవర్స్ లో వెళ్ళి నాన్నని చూసొచ్చాం. అప్పుడూ నాన్న నాకా మాటే చెప్పాడు – త్వరలో నయమయి ఇంటికి వచ్చేస్తానని, బాగా చదువుకుని మంచి ర్యాంక్ తెచ్చుకోవాలని.

వేసవి శలవులయ్యాక స్కూలుకి వెళ్ళిన మొదటి రోజు. ఆరవ తరగతి, క్లాస్ లో మొదటి పీరియడ్. కొత్త తెలుగు మాస్టారు. వచ్చి పాఠం చెప్పే ముందు ఒక్కొక్కరినీ లేచి, నీ పేరు, నీకు క్వార్టర్లీ, హాఫ్ యియర్లీ, యాన్యువల్ లో వచ్చిన ర్యాంకులూ చెప్పమన్నారు. నా ర్యాంక్ క్వార్టర్లీ లో 20, హాఫ్ యియర్లీ లో 18, యాన్యువల్ పరీక్షల్లో 4. అందరూ చెప్పేశాక ఈ క్లాస్ లో బెస్ట్ ర్యాంక్ ఎవరిదో చెప్పండి అని క్లాస్ ని అడిగారు. అంతా మొదటి ర్యాంక్ వచ్చిన అబ్బాయి పేరే చెప్పినా, కాదన్నారు. తర్వాత రెండవ ర్యాంక్ తెచ్చుకున్న అబ్బాయి పేరు చెప్పారంతా. అయినా కాదని నన్ను లేచి నిలబడమన్నారు. నిలబడ్డాక అందరికన్నా ఈ అబ్బాయిది మంచి ర్యాంక్, ఎందుకో తెలుసా అని అడిగారు. అందరితోబాటు నాకూ అర్థం కాలా. మిగతా అందరి ర్యాంకులూ కొంచెం అటూ ఇటుగా అక్కడే ఉన్నాయి. ఈ అబ్బాయి మాత్రం 20 నుంచి 4 కి వచ్చాడు. ఇంత మెరుగ్గా ముందుకి ఎవరూ రాలేదు కనుక ఈ అబ్బాయిది బెస్ట్ ర్యాంక్ అని నాతో "ఇంకా బాగా చదివి ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకో" అన్నారు. ఆ మాస్టారి పేరు "శ్రీ వెంకటేశ్వర్లు". ఆ సంవత్సరం వార్డన్, మా హవుస్ మాస్టర్ కూడా ఆయనే. తర్వాత మా క్లాస్ లో ఎక్కువమందికి ఇష్టమైన మాస్టర్

అయ్యారు.

ర్యాంక్ కార్డు ఇంటికి పోస్ట్ చేసి పేరెంట్ సంతకంతో మాకే తిరిగి వచ్చాక తీసుకుని స్కూల్ ఆఫీస్ లో పెట్టుకునేవారు. నా ప్రోగ్రెస్ కార్డు మీద సంతకం ఈసారి నాన్నది లేదు, తాతయ్యది ఉండింది. తర్వాత జాబుల్లో నాన్న నా ర్యాంక్ గురించి రాయ లేదు. నేనూ నాన్నకి తెలిసే ఉంటుంది, తప్పకుండా రాస్తారు అని ఎదురు చూశా. వారం వారం తప్పకుండా నాన్న దగ్గర్నుంచి వచ్చే జాబులు కూడా తగ్గాయి. ఒకసారి మనీ ఆర్డర్ కూడా నాన్న తమ్ముడు "సుధబాబు" పంపాడు. ఆ తర్వాత సంక్రాంతి శలవుల్లో ఇంటికి వెళ్ళేసరికి నాన్న ఆరోగ్యం బాగా క్షీణించిపోయింది. నెలలు, వారాలు దాటి రోజుల దగ్గరికొచ్చేసింది ప్రాణం. నాన్న స్థిరపడాలని కష్టపడి తను పుట్టి పెరిగిన ఊరు "దామరమడుగు" లో మూడేళ్ళ క్రితమే కట్టుకున్న మా కొత్త ఇల్లు, ఆ ఇంట్లో హాల్ లో కర్టెన్ వేసి అవతల నాన్న మంచం. నేను చూస్తే భయపడతాడని నన్ను చూడనివ్వనే లేదు, దగ్గరికి రానివ్వలేదు. పండక్కి కొద్ది రోజులుండి కావలికెళ్ళిన నన్నూ అన్ననీ ఒక రోజు ఉదయాన్నే మామయ్యలూ ఇంకా కొంత మంది బంధువులు కలిసి మా ఊరు "దామరమడుగు" కి తీసుకొచ్చారు. బస్టాండ్ లో బస్ దిగుతుంటే బావురు మని "రామచంద్ర మామ ఇంక లేడు" అని బిగ్గరగా ఏడ్చిన పెద్దమామయ్య ఏడుపు విన్నాక తెలిసింది, నాన్న ఇక లేడనీ, రాడనీ, తిరిగి రాని లోకాలకి దేవుడు తీసుకెళ్ళిపోయాడనీ. నాన్న వెళ్ళిపోయిన జనవరి 22, 1979 తర్వాతి రోజే నన్ను స్కూలు కి చిన్నమామయ్యతో పంపించేశారు. వెళ్ళనని ఏడ్చా, అయినా తప్పలా. శలవుల తర్వాతి మొదటి రోజు సాయంత్రం గేమ్స్ పీరియడ్, బోసిరెడ్డి సార్ అంటేనే అందరికీ భయం. స్కూలంతా అసెంబుల్ అయ్యున్నాం. సార్ వచ్చి 6 వ తరగతి లో "గిరిధర్" ఇలా రావాలి అని పిలిచారు, భయపడుతూ దగ్గరికెళ్ళా. "మీ నాన్న చనిపోయాడంట, అవునా?" అని అడిగారు. తన్నుకుంటూ వచ్చిన ఏడుపే నా సమాధానమయ్యింది. "సరే వెళ్ళు" అన్నారు. ఆ రోజు గేమ్స్ ఆడకుండా ఏడుస్తున్న నన్ను ఓదార్చిన స్నేహితుడు, నెల్లూరు దగ్గర కోవూరు నుంచి మా క్లాస్ లో నా మిత్రుడు పి.వి.ఆర్.ప్రసాద్.

జీవం లేని నాన్నని చూసిన చివరి చూపులు నన్ను వదల్లేదు, అమితంగా గుండెలు పిండుతూనే ఉన్నాయి, ఇప్పటికీ. చాలా రోజులపాటు మధ్యాహ్నం లంచ్ చేశాక ప్లే గ్రౌండ్ దగ్గరున్న చింత చెట్టు కింద నీడలో నిలబడి ఎదురుగా రోడ్లో కనిపించే బస్సుల్ని, దూరంగా "హిందూపురం" నుంచి "తిరుపతి" వెళ్ళే రైలుని చూస్తూ ఒక్కడినే ఏడుస్తూ గడిపిన కాలం కన్నీళ్ళలో కరిగి పోయినా ఇంకా గుండె లోతుల్లో దాగున్న కన్నీళ్ళతో కలిసే ఉంది. కొద్ది రోజుల తర్వాత నెమ్మదిగా మొదలయిన అంతుచిక్కని ప్రశ్న – నాన్న రాసిన చివరి ఉత్తరాల్లో నా ర్యాంక్ గురించి రాయలేదు. నాకు 4వ ర్యాంక్ వచ్చినట్టు నాన్నకి తెలిసిందో లేదో. ఈ ప్రశ్న నన్ను రోజూ వేధించ సాగింది. శలవులకి వచ్చినపుడు తాతయ్యని అడిగా. తాతయ్యకి అప్పుడు చెల్లా చెదురైె మేమున్న పరిస్థితుల్లో ఆయన సంతకం పెట్టి పంపించిన ప్రోగ్రెస్ కార్డు కూడా సరిగా గుర్తు లేదు. తర్వాతి ఐదేళ్ళూ మా క్లాస్ లో నా ర్యాంక్ 4 లేదా 5 లోనే స్థిరపడిపోయింది. 1, 2, 3 కోసం కష్టపడలేదు, కష్టపడమని జాబులో ఎవరూ రాయలేదు. అయితే ఆ ప్రశ్న మాత్రం నాతోనే పెరిగి పెద్దయ్యింది. చదువులన్నీ అయిపోయి జాబ్స్ చేస్తూ జీవితంలో ముందుకి వెళ్ళిపోయినా లోపలే దాగి ఉంటూ అప్పుడప్పుడూ అంతర్మథనంలోనుంచి వచ్చి కలవరపెడుతూనే ఉంది.

నాన్న మమ్మల్ని వీడిపోయి ఇప్పటికి 47 ఏళ్ళు. అయినా సమాధానం లేని ఆ ప్రశ్న నా అంతరంగాల్లోనుంచి నను ప్రశ్నిస్తూనే ఉంది.

"అసలు నీకు 4వ ర్యాంక్ వచ్చినట్టు నాన్నకి తెలిసిందా?

తెలిసిందేమో...

తెలిస్తే ప్రతి విషయం వివరంగా ఉత్తరాల్లో రాసే నాన్న ఈ విషయం రాయలేదు, బహుశా తెలీదేమో?

అవును, ఖచ్చితంగా తెలిసుండదు...

అయితే ఎలా తెలుస్తుంది?

నాన్నని తీసుకెళ్ళిన ఆ దేవుడు కనిపిస్తే అడిగితేనో...

ఆ దేవుడు నీకు కనిపిస్తాడా?

కనపడ్డుగాక కనపడ్డు...

మరయితే ఈ ప్రశ్నకి సమాధానం ఎలా తెలుస్తుంది?

ఎప్పటికైనా నేనే నాన్న దగ్గరికెళ్ళి చెప్పే దాకా తెలీదేమో...

అంతేనా?

అంతేనేమో...

ఏమో కాదు...అంతే!

***నా చిన్ననాటి జ్ఞాపకాల్లో "కన్నీటి జ్ఞాపకం"గా ఎప్పటికీ మిగిలిపోయిన "నాన్న"...***

# ఆ అయిదు మాటలే మళ్ళీ

అఫ్సర్

కవి, కథకులు, సారంగ అంతర్జాల పక్షపత్రిక ఎడిటర్

పెన్సిల్వేనియా, యూ.ఎస్.ఎ

1

ఏమేం చేసినా
నువ్వొక మబ్బు తునక కాలేవనే అంటాను.
ఎన్ని ఊహలు చేసినా
నువ్వొక ఆకాశపు అంచు కూడా చూడలేవనీ అంటాను.
ఎన్ని సముద్రాలు దాటినా
నీ అడుగు పడే దూరంలోనే నువ్వు వుంటావ్.

ఆ ఒక్క అడుగే సముద్రమో
ఆకాశమో
పర్వతమో అనుకుంటూ వుంటావ్.

2

అన్నీ పారేసుకుంటూనే వెళ్ళాలి
ఒక్క అడుగు ముందుకే వెళ్లాలనుకుంటే–
వెనక్కి జారిపోయే దృశ్యాలే అన్నీ,
మళ్ళీ కనిపించని మైలురాళ్లే ముఖాలన్నీ–
కాలానికి నీ మీద దయలేదు
ఒక్క క్షణమ్మీదా నీ పేరు రాసిపెట్టదు.

3

వెళ్లద్దు అనుకున్న చోటికే వెళ్ళి
గుప్పెడంత మట్టిని చల్లుకొస్తావ్
కాదు కాదన్న జనసమూహాల్లోనే నిలబడి
కాసిని మాటల్ని అరువు తెచ్చుకుంటావ్

4

ఏదీ నిషిద్ధం కాదనుకొని
ప్రతీదీ నీలోకి ఆహ్వానిస్తావ్
ఇవేవీ నీవి కానే కావని
ఒకటికి పదిసార్లు కావుకావంటాయి.

అయినా వెళ్ళాలి
గుప్పెడు దప్పిక తీర్చడానికి
సంద్రాలు దాటి–
అయినా మాటలు కలపాలి
కనుచూపు మేరా పరచుకున్న
ఎడారి సమూహాలతో–

5

ఏమేం చేసినా
నువ్వెవరికీ అక్కర్లేదనే అంటాను.
నువ్వొక పరాయీ పావురమై
ఎగురుతూ
ఎటో వెళ్లిపోతూనే వుంటావంటాను.

# మేధా మాయా వాణాస్త్రం

(ఉగాది సాహిత్య పోటీలో విజేతగా నిలిచిన కథ)

పద్మజ బలభద్రపాత్రుని
మెసాచుసెట్స్, యూ.ఎస్.ఎ

రాక్షసుల బృందం అంతా ఒకచోట చేరి ఉంది. రాక్షస రాజు రాజ సింహాసనంపై కూర్చున్నాడు.

చేతులు నలుపుకుంటూ, ఒక ముసలి రాక్షసుడు (ము.రా) రాజు గారితో అంటాడు. "ప్రభూ! నేను భూలోకానికి వెళ్లినప్పుడల్లా, విష్ణుమూర్తి విజయగాథలు వింటూ వింటూ విసిగి పోతున్నాను."

మిగతా రాక్షసులందరూ తలలూపుతున్నారు, అంగీకారంతో.

"ఆయన పది అవతారాలు తీసుకుని దుష్ట రాక్షసులను సంహరించాడని , శిష్ట రక్షణ చేశాడనీ ఎప్పుడూ ఆయనను స్తుతిస్తూ ఉంటారు. నిజానికి పదవ అవతారం కల్కి అవతారం కదా ! అది ఇంకా జరగాల్సి ఇంకా ఉందని, ఒకటే పారాయణాలు. వినీ వినీ శిరోభారంగా ఉంది" అన్నాడు (ము.రా).

రాక్షస రాజు కులాసాగా నవ్వుతూ అంటాడు "నా ప్రియ ప్రజలారా, ఆందోళన పడకండి. ఈ అవతారంలో విష్ణువు మనపై విజయం సాధించడం చాలా కష్టమవుతుంది."

ఇంకో చిన్న రాక్షసుడు (చి.రా) నిరాశగా నిట్టూర్చి అడుగుతాడు "ఎలా ప్రభూ? రాముడిగా, కృష్ణుడిగా ఇంకా ఇతర అవతారాల్లో మన రాక్షసులనెందరినో సంహరించాడు కదా! ఈసారి ఏమిటి భిన్నంగా చేస్తున్నాము?"

"ఎందుకంటే ఈసారి నేను ఆయనతో సంప్రదాయ యుద్ధం చేయను. మన వల్ల ఎలాంటి రక్తపాతం, హింస, అల్లర్లు జరగవు. ముల్లోకాలపై మళ్లీ ఆధిపత్యం సంపాదించడానికి మనం శారీరకంగా కష్టపడాల్సిన అవసరం లేదు." ప్రశాంతంగా అన్నాడు రాక్షస రాజు.

ఇంకొక ఉత్సాహపరుడైన రాక్షసుడు (ఉ.రా) భుజాలు కొట్టుకుంటూ "నాకు కొంత అల్లర్లు సృష్టించాలని ఉంది ప్రభూ! అయితే మీ ప్రణాళిక ఏమిటి?"

రాక్షస రాజు చిరునవ్వుతో అంటాడు "కొంచెం నీ ఉత్సాహం ఆపుకో. మనకూ, దేవతలకూ మధ్య పెద్ద యుద్ధాలు ఉండవు. విష్ణుమూర్తి మనవారిని ఎలాంటి యుద్ధంలోనూ సంహరించడు. సంహరించలేడు. ఈసారి నా విధానం భిన్నంగా ఉంటుంది. నెమ్మదిగా, నిశ్శబ్దంగా ఒక సరికొత్త ఆయుధాన్ని పరిచయం చేస్తాను. ఇది అన్ని కాలాల్లోకీ అత్యంత శక్తివంతమైన ఆయుధం. ఈ సమస్యను ఎలా ఎదుర్కోవాలో ఆయనకు అసలు అర్థం కాదు. ఏమి జరిగిందో కూడా తెలియకుండానే దాని ప్రభావంతో తడబడతాడు. నా ప్రణాళిక వల్ల కలిగే ప్రభావాన్ని తుడిచేయడానికి ఆయనకు కొన్ని యుగాల కాలం పడుతుంది... అది సాధ్యమైతే!"

(ఉ.రా) కొంచెం నిరుత్సాహపడతాడు, కానీ కుతూహలంతో అడుగుతాడు. "ఆ మాయా ఆయుధం ఏమిటి ప్రభూ? అంత శక్తివంతమైతే రక్తపాతం లేకుండా ఎలా ఉంటుంది?"

(చి.రా) చిందులేస్తూ "ఆ రహస్య ఆయుధం ఏమిటో చెప్పండి ప్రభూ! ఆసక్తితో చచ్చి పోతున్నాను. దయచేసి వివరాలు చెప్పండి." అని అడుగుతాడు.

రాక్షస రాజు ("ఈ రామరాజ్యం పంచలు భలే సౌకర్యంగా ఉన్నాయి" అని స్వగతంలో అనుకుంటూ , పంచ జేబులో నుంచి ఒక స్మార్ట్ ఫోన్ తీసి అందరికీ చూపిస్తాడు) "ఇదిగో... ఇదే నా రహస్య, అత్యంత శక్తివంతమైన ఆయుధం. దీన్ని సృష్టించడానికి నా శక్తినంతా వినియోగించాను. ఇది బ్రహ్మాస్త్రం లేదా గతంలో ఉన్న ఏ మహా ఆయుధానికీ తీసిపోదు. దీనితో ప్రపంచంలో చాలా శుభకరమైన కార్యాలూ చెయ్యచ్చు, ఎందుకూ పనికి రాని పనులూ చెయ్యచ్చు, అతి భయంకరమైన నష్టాలూ కలిగించచ్చు."

అందరూ నిరాశగా చూస్తారు. ఒకరిమీద ఒకరు మాట్లాడేస్తూ ఉంటారు.

(ఉ.రా) "ఇది చాలా చిన్నగా ఉంది ప్రభూ! ఇందులో ఎలాంటి శక్తి కనిపించడం లేదు."

(చి.రా) “మాతో సరదాగా మాట్లాడుతున్నారా ప్రభూ?”

రాక్షస రాజు (చిరునవ్వుతో) వివరిస్తాడు “ఇది ఏమి చేయగలదో చూపిస్తాను. దీనిని “స్మార్ట్ ఫోన్” అంటారు. “మేధావి దూరవాణి” , కానీ “మేధస్సుమాయ చేసేవాణి” అనికూడా అనచ్చు. ఇది ప్రపంచాన్ని మీ చేతిలో పెట్టగలదు... అదే సమయంలో దానిని దూరం చేయగలదు. ఇది మనిషిని అత్యంత సంతోషిగా చేస్తుంది, అత్యంత దుఃఖిగా కూడా చేస్తుంది. ఇది మనిషిని అందరితో కలిసిపోయే వ్యక్తిగా చేస్తుంది, అత్యంత ఒంటరిగా కూడా చేస్తుంది.”

(ము.రా) అపనమ్మకంగా చూస్తాడు. “అవునా? ఇది అంత చేయగలదా? కానీ ఎలా?”

రాక్షస రాజు “నా ఆయుధాన్ని ఆన్ చేస్తాను. దీనికి అవసరమైన గుండుగులు వేరువేరు రకాలుంటాయి. మొదట దీనికి “వై–ఫై” అనే దాని అవసరం ఉంటుంది. అది మానవ జాతి మనుగడకే మూలకారకమయి పోతుంది. తర్వాత కావలసిన రెండవ గుండుగు “సోషల్ మీడియా”, అంటే “సామాజిక మాధ్యమాలు”.

(ఫోన్ ఆన్ చేసి వారిని ఫేస్‌బుక్‌కి తీసుకెళ్తాడు)

(చి.రా) “అది ఏమిటి ప్రభూ?”

రాక్షస రాజు చెప్తాడు”ఇది సోషల్ మీడియా యొక్క ఒక భాగం. ఎలా వేర్వేరు విల్లుల కోసం వేర్వేరు బాణాలు ఉంటాయో, వేర్వేరు తుపాకులకు వేర్వేరు గుండుగులు ఉంటాయో, అలాగే వేర్వేరు సోషల్ మీడియా వేదికలు ఉంటాయి. ఎవరి ఇష్టం వారిది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ లేదా మరెన్నో వేదికలు... ఇవన్నీ ఆయుధాలుగా ఉపయోగించవచ్చు.”

(చి.రా) “ఈ వేదికల్లో ఏమి చేస్తారు?”

రాక్షస రాజు అడుగుతాడు”గత తరాల్లో యుద్ధం ఎలా ఉండేది? ప్రజలు ఎలా ఉండేవారు? గుర్తుందా?”

(ము.రా) “వారు కార్యాచరణలో చురుకుగా ఉండే వారు. యుద్ధంలో దూకి తమ శక్తినంతా వినియోగించే వారు. ఏదయినా చేసి యుద్ధం గెలవాలనుకునేవారు”

రాక్షస రాజు “ఇప్పుడు నేను వారిని దీని బానిసలుగా మారుస్తాను. దేన్లోకీ దూకి ఏ పనీ చేద్దామని లేని వాళ్ళలాగా, ప్రపంచంలోనే అత్యంత బద్ధకస్తులుగా చేస్తాను.”

(ఉ.రా) “అప్పుడు వాళ్ళని తేలికగా తొక్కిపారేయచ్చు. అద్భుతం ప్రభూ! ఇంకేమి చేస్తుంది?”

రాక్షస రాజు “మనమేమి తొక్కఖర్లేదు, వాళ్ళని వాళ్ళే నాశనం చేసుకుంటారు. పైగా వారిని బలహీనులుగా, చిరాకు స్వభావం కలిగినవారిగా, అనవసర భావోద్వేగపూరితులుగా చేస్తాను. ఆ భావాలను పూర్తిగా అపరిచితులతో పంచుకునేలా చేస్తాను.”

“సరే... సోమరితనం, బలహీనత! దానివల్ల ఉపయోగమేమిటి రాజా?” ఇంకో కుర్ర రాక్షసుడు (కు.రా) ప్రశ్నిస్తాడు.

తన సైన్యం కుతుహలానికి ముచ్చట పడుతూ, రాక్షస రాజు అంటాడు, “తొందరపడద్దు. వినండి. పూర్తిగా అపరిచితుల అభిప్రాయాలపై ఆధారపడేలా చేస్తాను. వారి చర్యలకు ఆమోదం, ప్రశంస కోసం ఎదురుచూస్తారు. అది లభిస్తే పిల్లల్లా ఆనందిస్తారు. రాకపోతే జీవితమే నాశనం అయినట్టు ప్రవర్తిస్తారు.”

(కు.రా) కి విషయం అర్థమవుతుంది “మన అసుర సైనికులలో కొందరిని నకిలీ మద్దతుదారులుగా, కొందరిని వేధింపుదారులుగా (వారిని ట్రోల్స్ అందాము) పెట్టి వీరిని విమర్శించేట్టు చేద్దాం ప్రభూ?” అంటాడు

రాజు గారికి అత్యంత ఆనందం కలుగుతుంది (కు.రా) సమయస్ఫూర్తి చూసి. “శభాష్! ఇప్పుడు మీరు అసాధారణ యుద్ధ రహస్యాన్ని గ్రహిస్తున్నారు. బాగా ఆలోచించారు!” అని మెచ్చుకుంటాడు.

(ఉ.రా) “నా బృందంతో మానవులు ప్రసారం చెయ్యటానికి అర్థంలేని పనులను సృష్టింపజేస్తాను ప్రభూ... పొద్దున్న, మధ్యాహ్నం, రాత్రి ఏమి తిన్నారో అందరికీ చూపించడం, నాలుగు అంగుళాల ఎత్తు జోళ్ళు వేసుకుని నడవడం ఎలా, మోకాళ్ళ వరకు జారిన పంట్లాముల తో తిరగడం ఎలా... ఇలా పనికిరాని ఎన్నో అవకాశాలు! వాటిని ఈ వేదికల్లో పెట్టి ఆమోదం కోసం జనం ఎదురు చూసేటట్టు చేద్దాం”అంటాడు.

(చి.రా) “అవును! ప్రశంసలు వస్తే మిగతా పనులన్నీ మరిచి ఆ పిచ్చి వీడియోలకే జీవితాన్ని అంకితం చేస్తారు.”

(ము.రా) “లేకపోతే తీవ్ర నిరాశలో మునిగి అన్ని పనులపైనా దృష్టి కోల్పోతారు. అలా కూడా జీవితాన్ని వృథా చేస్తారు.”

రాక్షస రాజు “ఈ ఫోన్‌లో “సెల్ఫీ”లు, అంటే తమరి చిత్రాలను వారే తీసుకుని మురిసిపోయే ప్రక్రియ, సాధనాలను ఇస్తాం. ప్రమాదకర ప్రదేశాల్లో ఫోటోలు తీసుకుంటూ తామే గాయపడతారు. మనం ఎవరినీ

చంపాల్సిన అవసరం లేదు."

(ఉ.రా) మళ్ళీ కొంచెం నిరుత్సాహపడతాదు, తనకొచ్చే చిత్రహింస అవకాశాలన్నీ పోతున్నందుకు.

(కు.రా) "సరే... అలసత్వం, బలహీనత, మూర్ఖత్వం, సమయ వృథా... ఇంకేమి నాశనాలు సృష్టించచ్చు?"

రాక్షస రాజు "వారి సహజ జిజ్ఞాసను తొలగిస్తాను. ఒకరితో ఒకరు మాట్లాడే మౌలిక నైపుణ్యాలను హరించేస్తాను."

(ము.రా) "అది ఎలా సాధ్యం? సోషల్ మీడియా ద్వారా మొత్తం ప్రపంచంతోనే మాట్లాడగలుగుతారు కదా?"

రాక్షస రాజు "సోషల్ మీడియా నిజంగా మాట్లాడటానికే అనుకుంటున్నావా? అది ప్రదర్శన కోసం మాత్రమే. మన గొప్పలు మనం డబ్బా కొట్టుకోవడానికి, ఇతరులను తెలుసుకోవడానికి కాదు. అదీ కాకుండా "టెక్స్టింగ్" అనే విధానాన్ని సృష్టిస్తాను. "లిఖిత సందేశ మార్పిడి". దీనితో పరిస్థితి మరింత దిగజారుతుంది."

(కు.రా) "దాని గురించి మరింత చెప్పండి ప్రభూ." ఆసక్తి ప్రదర్శిస్తాడు.

రాక్షస రాజు "చెప్తా వినండి. మొదట పూర్తి వాక్యాలతో సందేశం పంపిస్తారు. తర్వాత అర్థంలేని సంక్షిప్తాలు వాడతారు. తర్వాత పదాలకు సంకేతాక్షరాలు వాడతారు. చివరికి అర్థం చెప్పడానికి వింత చిత్రాలు... ఇమోజీలు... వాడతారు. గుహల గోడలపై చిత్రాలు గీసే ప్రాచీన మానవ దశకు వారిని తీసుకెళ్తాను."

(ఉ.రా) "అద్భుతమైన ఆలోచన ప్రభూ! వారి భాషా నైపుణ్యం, పదసంపద, వ్యాకరణం... చివరికి మాట్లాడే శక్తి కూడా తగ్గిపోతుంది. కానీ దానివల్ల ఉపయోగమేమిటి రాజా?"

రాక్షస రాజు "సంభాషణ లేని చోట సమాచార మార్పిడి ఉండదు. ఏ విషయమూ విచారించాలనే తపన, తృష్ణ అన్నీ పోతాయి. ఉట్టి మూర్ఖులుగా మిగిలిపోతారు. గత చరిత్ర పై గాని, వాస్తవ విషయాలపై గాని జిజ్ఞాస లేనివారిగా తయారవుతారు. పనికి రాని విషయాల మీద ఏకాగ్రత పెరిగిపోయి, ముఖ్యమైన విషయాలని ఉపేక్షిస్తారు. పైగా, వారిని క్రూరులుగా మారుస్తాను. ఎదుటివారి ముఖం మీద చెప్పలేని మాటలను ఈ వేదికల్లో చెబుతారు. వీరిని "సైబర్ బుల్లీలు" (సాంకేతిక మాధ్యమాల ద్వారా వేధించే వ్యక్తులు) అంటాను.

(చి.రా) "దాంతో ఏమవుతుంది? బుల్లి అంటే ఏంటో ముద్దు పేరులా ఉంది, రాజా, పెద్ద భయంకరంగా ఏమీ అనిపించట్లేదే?"

(ఉ.రా) "ఈ బుల్లీలు బలహీనులను విపరీతంగా వేధిస్తారు, ఆ మాత్రం అర్థం కాలేదా? మన పని వాళ్ళే చేసేస్తారు... వారు తమ ప్రాణాలు తామే తీసుకోవాలని అనిపించేంత వరకు."

(కు.రా) "మామూలుగా అయితే అది చాలా దుఃఖకరమైన విషయం, కానీ మనం రాక్షసులం కదా, అలాంటివి భావించకూడదు. ఈ అత్యంత శక్తివంతమైన ఆయుధాన్ని వారు ఎలా ఎదుర్కోవాలో వారికే తెలియదు."

రాక్షస రాజు "మీకందరికీ దీనివెనక సిద్ధాంతం అర్థమయిపోయింది. ఈ ఆయుద్ధాన్ని ఎలా మెరుగు పరచాలో ఇంకా సలహాలు రానియ్యండి."

(ము.రా) "ఈ పరికరానికి బానిసలై, తమ జీవితంలోని మనుషులను పట్టించుకోరు. ఈ ఫోన్‌కే సమయం కేటాయిస్తారు. దాంతో వారి నిజజీవితం కష్టసాధ్యమవుతుంది. సంబంధాలు, బంధాలు లేకుండా పోతాయి."

(చి.రా) "అవును... ఈ బానిసత్వం వారి సంబంధాలు, సమయం, ఉద్యోగం, ధనం, బుద్ధి, చివరికి ఆనందాన్ని కూడా దోచేస్తుంది." ఒక దుష్ట నవ్వు నవ్వుతాడు.

రాక్షస రాజు "ఇప్పుడు మీరు అసలు సారాన్ని గ్రహించారు. పాత రోజుల్లో లాగా వీధుల్లోకి వచ్చి పోరాడరు. అందరూ "సోషల్ మీడియా కార్యకర్తలు" అవుతారు. ఇంట్లో కూర్చుని సందేశాలు పెట్టి ఒకరినొకరు దూషిస్తారు. ఉపయోగం కంటే నష్టం ఎక్కువ."

(చి.రా) "మన సహాయం లేకుండానే తమలో తామే విభేదాలు సృష్టించుకుంటారు! (హా హా)"

రాక్షస రాజు "ఇంకా ఇంకా సలహాలు రానియ్యండి" శిష్యులపై గర్వంతో ఛాతీ ఉప్పొంగుతుంది.

(ఉ.రా) "తర్వాత తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేద్దాము . ఏది నిజం, ఏది అబద్ధం తెలియకుండా చేద్దాము . కృత్రిమ మేధస్సుతో నకిలీ వీడియోలు, నకిలీ స్వరాలు సృష్టిద్దాము. గందరగోళం, బాధ, అల్లర్లు పెరుగుతాయి. ఒకడినొకడు కొట్టుకుని, తిట్టుకుని ఛస్తారు. ఏమంటారు రాజా?"

రాక్షస రాజు "ఉత్తమం, అత్యుత్తమం."

(ము.రా) "అది ఒక్కటే కాదు. పక్కవాడికి కష్టం వస్తే వాడికి సహాయం చేసే బదులు, దాన్ని ఈ ఫోన్తో చిత్రాలు, వీడియోలు తీసి, అక్కడ లేని వారితో పంచుకుని, దానిపై పనికిరాని అభిప్రాయాలు పోస్ట్ చేసుకుని, దాని గురించి అభిప్రాయభేదాలతో కొట్టుకుని చచ్చి, ఇలా తెలియని వలయంలో మునిగిపోతారు. "

రాక్షస రాజు "అద్భుతం! నీ జీవిత అనుభవం అంతా ఇక్కడే తెలుస్తోంది . చివరాఖరికి, అత్యంత ప్రమాదకరమైన గుండుగు ఒకటుంది చెప్పనా? చాలా సాధారణమైన విషయంలా అనిపించచ్చు, కానీ చాలా ప్రమాదకరం"

(చి.రా) "ఏమిటది ప్రభూ?" పట్టలేని ఉత్సుకతతో అడుగుతాడు

రాక్షస రాజు "ఉదాసీనత" అని నాటకీయంగా, గట్టిగా ప్రకటిస్తాడు

(ఉ.రా) కళ్ళు తల్లో దాకా తిప్పి, ఇదో పెద్ద విషయమా అన్నట్టు చూస్తాడు

రాక్షస రాజు కోపం తెచ్చుకోకుండా, చిరునవ్వుతో, ఓపికగా వివరిస్తాడు "అవును, ఉదాసీనతే! ఏమీ పట్టించుకోకపోవడం అంత ప్రమాదం ఇంకోటి లేదు. సానుభూతి ఉంటే పరుల కష్టాలకి, ప్రపంచ సమస్యలకి ఏమయినా స్పందిస్తారు. వ్యతిరేక భావన ఉంటే ప్రతిస్పందిస్తారు. కానీ ఉదాసీనత ఉంటే? ప్రపంచం నాశనం అవుతున్నా పట్టించుకోరు. ఎందుకంటే..."

అందరూ ఏక గళంతో " వారు స్మార్ట్ ఫోన్‌కు బానిసలైపోయారు కాబట్టి!"

రాక్షస రాజు "అద్భుతం. మీరు అర్థం చేసుకున్నారు."

(ఉ.రా) "ఈ ఆయుధమే అన్నీ చేస్తే మనం ఏమి చేస్తాం ప్రభూ? గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవాలా?"

రాక్షస రాజు "మనం ప్రశాంతంగా కూర్చుని వాళ్ళ మూర్ఖ జీవననాటకం చూస్తాం. వాళ్లే తమ ప్రపంచాన్ని నాశనం చేసుకుంటారు. ఆ తర్వాత మన పని సులభం. భూలోకంలో ఈ ప్రయోగం విజయవంతమైతే అన్నిలోకాలపైనా ఈ స్మార్ట్‌ఫోన్ అయుధం సంధిద్దాం. ముల్లోకాలపై మనదే అధికారం. ఈసారి వారు ఎంతో ప్రేమించే విష్ణుమూర్తికే ఈ కల్లోలాన్ని నియంత్రించడం కష్టమవుతుంది."

*(అందరి దుష్ట నవ్వుతో రాజుగారి సభ ముగింపు.)*

# ధ్యానం - హైకూలు

భాస్కర్ పులికల్
కవి, కథకులు
ఫ్లోరిడా, యూ.ఎస్.ఎ

**ధ్యానం:**
అంతట స్తబ్దం
ఆగిపోయిన కాలం
నిశ్శబ్ద శబ్దం

**సమయం:**
నత్త నడక
సంధ్యా సూర్య గమనం
లేడి పరుగు

**శిశిరం:**
కప్పు తేనీరు
నీటి రంగు మార్చిన
ఎండుటాకులు

**చెరిగిన కల:**
బావి అద్దంలో
జారి పడిన జాబి
గీసిన అల

**చిరునవ్వు:**
నెల వంకలా
పెదాల విరుపులు
మెరిసే క్షణం

**కళ్ళు:**
కను పాపలు
ప్రేమకు విచ్చుకునే
కలువ పూలు

**స్నేహం:**
వీచే గాలిలో
విరబూసిన పూల
వింత సవ్వడి

**కోపం:**
కొమ్మల యుద్ధం
కణం రాలిన క్షణం
ఖాండవ వనం

**జీవన వలయం:**
తుఫాను గాలి
ఒరిగిన వృక్షాలు
కొత్త మొక్కలు

**ధన్యవాదాలు:**
ఓ ఎదిగిన
కాకి గూటి కోయిల
గళం విప్పింది

# నా ఇండియా ప్రయాణం

(ఉగాది సాహిత్య పోటీలో ప్రశంశాపత్రం పొందిన వ్యాసం)

ఋత్విక్ శర్మ వారణాసి
మెసాచుసెట్స్, యూ.ఎస్.ఎ

నేను నాన్న విమానం ఎక్కామనే గాని నా మనసు మొత్తం ఇండియాలో ఏం చేయాలని, ఎన్నెన్నో చేయాలని, కానీ అవి ఏంటో తెలియక తికమకగా ప్రయాణం సాగింది. అమ్మమ్మతో కబుర్లు, తాతయ్యతో షికార్లు, పిన్నితో పేకాట, నాయనమ్మ తాతయ్యతో సిన్సియర్గా కనపడటానికి పాట్లు, ఇలా నా ఆలోచనలు కిటికీలో కనిపిస్తున్న మబ్బులు కదులుతున్నట్టు కళ్ళ ముందు కదలాడుతుంది.

ఎంతో దూరమైనా, నా ప్రయాణం ఆలోచనలతో ఇట్టే గడిచిపోయింది. హైదరాబాదు రానే వచ్చింది. అక్కడ రెక్కలు చాచి విమానం దిగుతుంటే అదో వింతైన అనుభూతి. దిగి దిగగానే సబ్వే కనిపించింది. మనసు పోదాం పద అంది. కానీ అక్కడికి వెళ్లిన తర్వాత తెలిసింది సబ్వే అమెరికా లాగా కాదు అని చెప్పి సరే ఒక పనీర్ సాండ్విచ్ లాగిచ్చి అయింది అనిపించి నాయనమ్మకు సర్ప్రైజ్ ఎక్కువగా ఉంటుందని కారు మాట్లాడుకుని మేమే బయలుదేరాము. ఎవరినీ రమ్మనలేదు. ఎయిర్పోర్ట్కి ఆశ్చర్యమేమంటే మేము మాట్లాడుకున్నటువంటి కారు చైనాకు సంబంధించిన బివైడి కారు. అది ఒక ఎలక్ట్రిక్ కారు. నాకు ఎంతో అబ్బురంగా అనిపించింది ఎంతో దూరంలో ఈ ఎలక్ట్రిక్ కార్ ఏంటో అనిపించింది. ఇది డెవలప్ అవుతున్న ఇండియాకు నిదర్శనమేమో అన్నట్టుగా ఉంది ఎంతో చక్కగా అలసట లేకుండా ప్రయాణం సాగింది. నాలుగు గంటలైనా తెలియలేదు రోడ్డు మీద.

ఇంకా వింత ఏమిటంటే ఒక పొలంలో వందలు వందల కొద్ది కోతులు ఒక్కచోట కూర్చుని ఏదో చేస్తూ కనిపించాయి. అది వింతగా అనిపించింది.

చివరికి తొర్రూరు చేరుకున్నాము ఇంటి ముందు అప్పుడే నాయనమ్మ ఇంటి ముందు ముగ్గేస్తోంది. ఉదయం ఎనిమిది గంటలకు కావచ్చు, మమ్మల్ని చూసింది ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది.

అలా మొదలైన మా ప్రయాణం తర్వాత కజిన్స్ సుబ్బు, పద్దు రావటంతో ఇంకా ఉత్సాహంగా సాగింది. నేను రోడ్డు మీద క్రికెట్ ఆడటం మొదలు పెట్టాను. క్యారం బోర్డ్ ఆటలు, క్రికెట్ ఆటలు, స్కూటీ నడపటం ఇలా సరదా పనులు చాలా చేశాను.

తర్వాత అనుమకొండ తాతయ్య, అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళాను. అక్కడ వాళ్ళు నన్ను ఎంతో అద్భుతంగా చూసుకున్నారు. ఏది అడిగితే అది కొనిచ్చారు.

తాతయ్య తనకు తెలిసిన వంటలన్నీ నాకు చేసి పెట్టాలి నేను తినాలి నేను బాగుంది అని చెప్పాలని ఎంతో ఉత్సాహంగా చేస్తూనే ఉన్నాడు. మాతో పాటు ఇండియాకు రాలేదు మా అమ్మ ఈసారి. ఆమె అమెరికా నుండి అన్ని సజెషన్లు అన్ని వివరాలు చెబుతూ ఎలా చేయాలి, ఎక్కడ తినాలి, ఎక్కడ తినొద్దు, అని చెప్పే భాగవతంతో మొదలయ్యి, తాతయ్యతో ఊరంతా తిరగటం వరకు సాగేది నా రోజు. మర్చిపోయాను, తాతయ్య నాకు ఒక మిత్రుడిని కూడా కలిపాడు, ఇంటి పక్కనే ఉన్న నా వయసే ఉన్న ఆ పిల్లాడిని ఆడుకోమని నాకు ఫ్రెండ్గా పరిచయం చేశాడు

అతని పేరు కార్తీక్. అతను తన స్కూల్లో ఎలా ఉంటుంది ఎలా చదువుకుంటాడు ఎప్పుడెప్పుడు ట్యూషన్కి వెళ్తాడు ఎప్పుడు స్కూల్ కి వెళ్తాడు అన్ని తెలుసుకున్నాను. నా స్కూల్ విషయాలు కూడా అతడిని చెప్పాను.

ఇంతలోనే మళ్లీ తిరుగు ప్రయాణం రానే వచ్చింది. అమ్మమ్మ నన్ను ఇంకో నాలుగు రోజులు ఉండమంది నాయనమ్మ కూడా అదే మాటంది. ఇద్దరు తాతయ్యలు చెప్పకనే అదే మాట చెప్పారు.

నేను ఇప్పుడైతే అమెరికాకు వచ్చాను. స్కూల్ మొదలైంది అన్ని నార్మల్ గా ఉన్నాయి కానీ మళ్ళీ సమ్మర్ వెకేషన్ ఎప్పుడు వస్తుందా మళ్ళీ ఇండియాకి ఎప్పుడు వెళ్దామా అని ఎదురు చూస్తూ ఉన్నాను.

# అర్థనారీశ్వరం

శ్రీనివాస్ బలభద్రపాత్రుని
మెసాచుసెట్స్, యూ.ఎస్.ఎ

ఓంకారం, అక్షర పరబ్రహ్మ దివ్యతత్వం
అద్వైతం, అద్వితీయం
పరమార్థ సత్యం పరిపూర్ణజ్ఞానం
పరమం అనంతం పవిత్రం నిత్యం ॥ ఓంకారం ॥

ఏకమనేకమ్ములై అనంతకోటి లోకమ్ముల
సకల చరాచరములుగా సృష్టి విస్తరింపగా
నిఖిలలోక నాయకుడు నిరీశ్వరుని తలపులో
ఒక స్పందన జనియించి సంకల్పమాయె
ఆ సంకల్పశక్తియే ఆదివిభుని విభూతి
ఆదిపురుషుని శక్తి, ఆది పరాశక్తి

సృష్టిస్థితిలయ చక్రభ్రమణమును
ప్రపంచనాటక రంగమందున
స్రష్ట అయిన పరమేశ్వరుడొక్కడు
త్రిమూర్తులుగ భాసిల్లె
బ్రహ్మదేవుడై సృష్టించి
మహా విష్ణువై పోషించి

పరమశివునిగా లయముసేయుటకు
త్రిమూర్తులుగ భాసిల్లే
పరమేశ్వరుడొక్కడు త్రిమూర్తులుగ భాసిల్లే

అంతట పరమేశ్వరుడు బ్రహ్మదేవునిగాంచి సృష్టికార్యము
ఆరంభింపమనిన, బ్రహ్మదేవుడు శివుని ఆనతిని గొని
సృష్టి మొదలిడెను......

విరించి విరచిత మానసిక సృష్టి
మరీచి మొదలగు ప్రజాపతులకు
నారద సనకసనందనాదులకు పరిమితమై మరి
సాగదాయెను

మానసిక సృష్టి చేసి మరి ముందుకు సాగుటకు దిక్కు
తోచని బ్రహ్మదేవుడు, శివుని శరణువేడి
ఘోరతపంబొనరించే .....

కలత చెందిన కమలసంభవుని జూచి
జాలినొందిన నీలకంఠుడు
అలౌకికమ్మైన అనుపమానమ్మైన
లలిత కలిసిన అర్ధదేహమును జూపే

ఒక్క పరమేశ్వరుడు రెండుగా కనిపించె
ఆదిపురుషుడు సగము, ఆదిశక్తియు సగము
అర్ధనారీశ్వరుడు సాక్షాత్కరించే....
శివశక్తి ఏకత్వ తత్వమే చాటే
ఓం నమశ్శివాయైచ ఓం నమశ్శివాయ!!

ఆదిశక్తి ధరియించిన స్త్రీ ఆకారం
ఆదిమిథున రచనకు ఆవిష్కారం
వేదగర్భుడంత చుట్టే మిథున సృష్టి శ్రీకారం
వేదనుతుడు ఆదివిభుని స్పందనాయె సాకారం
ఓం నమశ్శివాయైచ ఓం నమశ్శివాయ!!

వామదేవుని ఢమరుకనాదం
ఢమ ఢమ ఢమ ఢమ ఢమ ఢమ ఢమ ఢమ
ఢమ డఢమ డఢమ ఢమ ఢమ ఢమ ఢమ ఢమ
వామదేవుని ఢమరుకనాదం సృష్టిక్రమానికి
అంకురార్పణం
వ్యోమకేశుని అభయహస్తమే సకల చరాచరస్థితి సంకేతం
ప్రమథనాథుని కరదీప్తాగ్నియె ప్రపంచానికి

ప్రళయసూచకం
ఉమేశు దక్షిణపాదమె గుణదోషాన్విత పాశ బంధకేతనం
తిమిరాంతకుని వామపాదమె క్షరాక్షరాతీత మోక్షనిధానం
ఓం నమశ్శివాయ ఓం నమశ్శివాయ
ఓం నమశ్శివాయ ఓం నమశ్శివాయ !!

కమలభవుని ఆననమున జ్ఞానశక్తిగా అకారరూపిణీ వాణీ
కమలాక్షుని మానసమున ఇచ్ఛాశక్తిగా ఉకారరూపిణీ నారాయణీ
కామహరుని మేనిలో క్రియాశక్తిగా మకారరూపిణీ శర్వాణీ
అకార ఉకార మకార రూపిణీ, ఓంకార రూపిణీ జగజ్జననీ

అరమరికలు లేని అన్యోన్యం

తారతమ్యము లేని సామరస్యం
పాలూ నీళ్ళు కలిసిన మిథునం
ఆలుమగలకిల ఆలవాలం
ఓం నమశ్శివాయైచ ఓం నమశ్శివాయ!!

వాగర్థాలై మాతాపితలై
క్షేత్రబీజములై ప్రకృతీ పురుషులై
ఆదిదంపతుల ఏకత్వం ఆలుమగలకిల ఆదర్శం
ద్వంద్వాతీత ఏకత్వం ఆలుమగలకిల ఆదర్శం
ఓం నమశ్శివాయైచ ఓం నమశ్శివాయ!!

శ్వేతవర్ణముతోను శంకరుడు, స్వర్ణవర్ణముతోను శాంకరి
జుట్టుముడి వేసెను జగజ్జనని, జటలధారిగనుండె జంగమయ్య
అంగజుని హరియించె హరుడు, అనంగునిగ బ్రతికించె గిరిజ
కరకంకణాలు కాళ్ళకు కడియాలు హిరణ్యాభరణాలు కరుణగల తల్లికి
నాగులే యోగులై యోగీశ్వరుండైన నగకన్య పెనిమిటికి ఆభూషణాలు
ఓం నమశ్శివాయైచ ఓం నమశ్శివాయ!!

నశ్వరమీ లోకమనీ చాటుటకో ఏమో
ఈశ్వరుండు ధరియించె చితిబూడిద లేపనము
శాశ్వత సౌభాగ్యవతిగ విలసిల్లు ఈశ్వరి
ఐశ్వర్యమ్ముగ దాల్చెను కస్తూరి కుంకుమలు
ఓం నమశ్శివాయైచ ఓం నమశ్శివాయ!!

కల్పతరువు కుసుమాలు మందారముల మాల
కల్పవల్లి మాతల్లి కామాక్షి దాల్చె
తలరాతలు రాసేటి బ్రహ్మలెందరో, వారి
తలల కపాలముల మాల దాల్చె కాలకాలుడు
ఓం నమశ్శివాయైచ ఓం నమశ్శివాయ!!

చలువ చూపెను అఖిల సృష్టి హేతువు తల్లి
నల్ల కలువల రేకులను బోలు కనులతో
విలయతాండవమాడేటి లయకర్త నయనాగ్ని
ఉత్పుల్ల శోణితాంబుజములను బోలె
ఓం నమశ్శివాయైచ ఓం నమశ్శివాయ!!

ఆదిశంకరాచార్య విరచిత అర్ధనారీశ్వర స్తోత్రం
సామవేద షణ్ముఖాచార్యోక్త ప్రవచన ప్రేరిత కేశవ సుతనుతం
శ్రవణానందకరం, మననానందకరం
భజనానందకరం, నృత్యానందకరం
నయనానందకరం, ఆత్మానందకరం
సురుచిరం, సుమధురం, శుభకరం, సుశీలం
అర్ధనారీశ్వరతత్వం, అర్ధనారీశ్వరతత్వం.

# పదవినోదం

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ✿ | 3 | | 4 | ✿ | 5 | 6 | 7 |
| | ✿ | | ✿ | 8 | | ✿ | 9 | 10 | | | |
| 11 | | ✿ | 12 | | | 13 | ✿ | 14 | | ✿ | |
| | ✿ | 15 | | | ✿ | 16 | 17 | | ✿ | 18 | ✿ |
| ✿ | 19 | | | ✿ | 20 | | | ✿ | 21 | | 22 |
| 23 | ✿ | | ✿ | 24 | | ✿ | 25 | | | ✿ | |
| ✿ | 26 | ✿ | 27 | ✿ | 28 | 29 | | ✿ | 30 | 31 | ✿ |
| 32 | | 33 | ✿ | 34 | | | ✿ | 35 | ✿ | 36 | 37 |
| | ✿ | 38 | 39 | | ✿ | 40 | 41 | ✿ | 42 | | |
| 43 | | ✿ | 44 | | | ✿ | 45 | 46 | | | ✿ |
| | ✿ | 47 | | | ✿ | 48 | | | ✿ | 49 | 50 |
| ✿ | 51 | | | ✿ | 52 | ✿ | | ✿ | 53 | ✿ | |

**అడ్డం:**

1. మన్మథుడు (4)
3. తామర (3)
5. సీత, భూమిజ (3)
8. ఒక నాణెం (2)
9. బంగారు కొండ (342)
11. కలకలం; కలహం! (2)
12. కైలాసగిరి (1)
14. ఏడు రోజులు (2)
18. ఒక పండ్ల చెట్టు... కదళి (3)
18. అమెరికా కరెన్సీ (9)
19. హృదయం (3)
20. మాట (9)
21 స్వర్ణదేవాలయం ఏ రాష్ట్రంలో ఉంది? (1)
23. 'నేను'లో ఉంది - 'తాను'లో లేదు (1)
24. గోదా (2)
25. మునగు; స్నానం (0)
27: అడ్డం 23తో ధరణి (1)
28. చురుకుతనం (1)
30. భయం, సంకోచం (2)
32. స్నేహితుడా! (3)
34. తన అభిప్రాయాలతో విభేదించే వారిని నిర్దాక్షిణ్యంగా అణచివేసేవాడు (3)
35. అడ్డం 27తో స్వప్నం (1)
36. శనైశ్చరుడు (2)
38. కలిమి (1)
40. ఆగ్రహం (2)
42. గుడి (3)
43. హిందీలో... బండి, శకటం (2)
44. గుడికి వెళ్ళి దేవుడిని 'చూడటం' (1)
45. దుప్పి (1)
47. కవిత్వం (3)
48. దాత, వదాన్యుడు (3)
49. పడి ఎడమైన కుసుమాలు (2)
51. భర్త తమ్ముడు (3)
52. అడ్డం 35తో కోతి (1)
53. అడ్డం 52తో కోయిల (1)

**నిలువు:**

1. ఈ రథమంటే కోరిక! (4)
2. బావి (2)
3. రాయలసీమలో ఒక జిల్లా (3)
4, రావణుడి రాజ్యం (2)
5. మొసలి (3)
6. తక్కువ; హేయమైన (2)
7. భువిలో, విశ్వంలో (3)
8. ఏనుగును అదుపు చేసేవాడు (3)
10. మగ్గం మీద నేసి మంచానికి అల్లే నూలు పట్టీ (3)
12. తల (3)
13. వందనాలు (3)
15. అగ్ని (3)
17. ఒక పక్షి; టిట్టిభం! (4)
18. పులి దెబ్బ (2)
20. ఎరుక; ఒకరికొకరు తెలిసి ఉండటం (4)
21. పద్మం, సరోజం (3)
22. మతి (2)
26. కొంచెం, జర (2)
29. తలకిందులుగా- కోతలరాయుడు కోసేవా? (3)
31. శ్రీరాముడి తనయులు (4)
32. నేరాలు చేసినవాళ్లు (4)
33. నెల (2)
34. తార్కాణం (4)
37. నిశ్చయమేగానీ ...మధ్యలో మాయమైంది (2)
39. తొమ్మిదవ దాని తరువాతది (4)
41, చక్కెర (4)
42. రుచులు... ఎన్ని? (2)
46. మూకుడు, సిబ్బి (2)
47. వినుగు (2)
50. అర్చన, ఆరాధన (2)

# నన్నెచోడుని పద్య సౌరభం

గార రంగనాథం

**కవి, వ్యాసకర్త, రాజాం రచయితల వేదిక వ్యవస్థాపకులు**

**రాజాం, ఇండియా, +91 98857 58123**

నన్నెచోడుడు సూర్యవంశానికి చెందిన రాజు. కరికాలచోడుని వంశీయుడు. చోడబల్లికి పట్టపురాణియైన హైహయాన్వయ సంజాతయైన శ్రీసతికి కుమారుడు. ఒరయూరికి అధిపతి. దక్షిణదేశానికి సూర్యుడనే అర్థమిచ్చే 'టెంకణాదిత్యుడు' అనే బిరుదమున్న వాడు. కాశ్యపగోత్రుడు. అనేక యజ్ఞాలను చేసినవాడు. కవిత్వపరంగా 'కవిరాజశిఖామణి' అను బిరుదముగల సత్కవి. తన కుమారసంభవ కావ్యాన్ని శ్రీశైలంలో నివసిస్తున్న జంగమ మల్లికార్జునునికి అంకితమిచ్చాడు.

నన్నెచోడుడు రచించిన ఏకైక గ్రంథం 'కుమార సంభవం'. ఇందులో సతీదేవి పుట్టుక, గణపతి జననము, దక్షయజ్ఞ ధ్వంసం, పార్వతి జననం, తపస్సు, పార్వతీ పరమేశ్వరుల వివాహం, వారి శృంగారవిలాసాలు, కుమారస్వామి పుట్టుక, అతడు యుద్ధంలో తారకాసురుని చంపుట అనే అంశాలున్నాయి. కుమారస్వామి కథతోపాటు ముందుగా వినాయకుని కథను కూడా రచించాడు. శైవుడు విఘ్నేశ్వరుని స్తుతించకుండా ఏపనీ చేయడు కదా! ఇది తన స్వతంత్ర రచన. సంస్కృత ఇతిహాసాలనుండి తీసుకున్న కథలను రెండింటిని గుదిగుచ్చి, నన్నెచోడుడు దీనిని రాశాడు. కావ్యంలోని కొన్ని సురభిళ పద్యాలను ఆఘ్రాణిద్దాం.

తండ్రి పిలుపు మేరకు సతీదేవి మాత్రమే దక్షయజ్ఞాన్ని చూడడానికి వస్తుంది. ఆదిదేవుడైన శంకరుని ఆహ్వానించకుండా ఈ యజ్ఞం ఎలా చేస్తున్నావని ఆమె దక్షుని ప్రశ్నిస్తుంది.

వైభవోపేతులైన విష్ణు బ్రహ్మాది దేవతలుండగా అస్థిపంజరం, పుఱ్ఱెలు, భయంకర సర్పాలు, జడలు, చర్మాలు, ఎముకలు ధరించువాడు, విబూది రాసుకొన్నవాడు అయిన ఈశ్వరుడు ఇక్కడకు రావడానికి అర్హుడా? అని దక్షుడు బదులిస్తాడు.

**మ. త్రిజగన్నాథుఁ బవిత్రగాత్రుఁ, గ్రతుమూర్తిం, బాత్రు సత్పూజ్యుఁడే**
**యజినాభీలక పాలశల్యధరుఁడీ యజ్ఞాదులం దంటి, వీ**
**ద్విజదేవాదులకుం గపాల కవచాస్థి వ్రాతముల్ మేనులన్**
**నిజమైయున్నవి రుద్రచిహ్నా లివె, వీనిం బుచ్చి రా నేర్చిరే? -2-23**

"కపాలాదులు ఈశ్వర చిహ్నాలు. ప్రతివ్యక్తీ వాటితోనే జీవిస్తుంటాడు. వాటిని విడిచి ఎవరూ ఇక్కడికి రాలేదు కదా! మరి శంకరుని ఎందుకు పిలవలేదు?" అంటుంది శచీదేవి. ఇక్కడ తండ్రీ కూతుళ్ళ సంవాదం రక్తిగా సాగించాడు కవి.

దక్షాధ్వర ధ్వంసానికి గణనాయకులందరూ నేనంటే నేను వెళతానని ఉద్యుక్తులౌతుండగా వినాయకుడు లేచి పరమేశ్వరునితో ఇలా అంటాడు.

ఉత్సాహ:- **బలిమిఁ బిట్ట కలిగి పాశుపతము దొడుగ నేటి? క**
**గ్గలిక ములుకకాయ కెత్తుగల్లు గొనఁగ నేల? ము**
**న్నెలుక వేఁట కుఱుము తిండి యేల? నీకు నలుగఁగాఁ**
**దలము గలదె? నన్నుఁ బనుపు దక్షుఁ బట్టి తెచ్చెదన్! -2-60**

చిన్న పిట్టపై కోపించి పాశుపతాస్త్రం వేయవచ్చునా? అంటాడు. నేడు పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం అనే నానుడి ఉంది. ఈ కవి శైవుడు కదా! బ్రహ్మను అధికుడుగా చెప్పడుకదా! అందుకే పాశుపతాస్త్రం అన్నాడు. నేలమీద పండే ముండ్లవంకాయను కొయ్యడానికి ఎత్తురాయి తేవడం ఎందుకు? అంటాడు. అది అందని మ్రానిపండు కాదు కదా! ఎలుకను వేటాడడానికి ఉడుములు తినే కుక్కను తేవడమెందుకు? ఈ ఉపమలన్నీ ఆకాలం నాటి వేటసాధనాలు, ప్రజల పరికరాలు. ఎంత సహజంగా వాడుకున్నాడో కదా ఈ కావ్యంలో! రాజుకదా మరి.

బంధించిన దక్షుడ్ని, వేటాడిన జంతువును తెచ్చినట్టు కాళ్ళూ చేతులూ కట్టి, కర్రకు వేలాడదీసి మోసుకొచ్చారట. ఇలాంటి జానపద జీవనం ఈ గ్రంథమంతా మనం చదవవచ్చు. యౌవనంలో అడుగుపెట్టిన పార్వతివర్ణన ఎంత సహజమనోహరంగా చేశాడో చూద్దాం.

**క. మానితమగు గుదరసమున**
**నూనిన తుండీర ఫలము, యొగిఁ దేనె తెలెన్**
**నాని మృదువైన పవడము**

**నా నద్రిజ తోపు మోవి నయమై యొప్పున్-3-62**

పార్వతిపెదవి బెల్లపు పాకంలో ముంచిన ఎఱ్ఱని దొండపండా? తేనెలో మెత్తగా నానిన పగడమా? అన్నట్టుందట. శివుడు తపస్సు చేస్తున్నాడు. పార్వతి అతనికి పరిచర్య చేస్తోంది.

క. **వినుతింపఁ గామసుఖ సా**
**ధనమగు నా గౌరిఁ జంద్రధరుఁడు తప స్సా**
**ధనముగఁ జరించె; నుత్తము**
**లనయము విపరీత చరితులైనను జనదే?-4-3**

కామసుఖ సాధనం కాగల పార్వతిని శివుడు తపస్సాధనంగా వాడుకుంటున్నాడట. ఇసుమంత హాస్యాన్ని .జోడించే ఈ చమత్కారం కడు రమణీయం. ఇంద్రుడి ఆజ్ఞమేరకు మన్మథుడు శంకరుని తపస్సుభగ్నం చెయ్యడానికి సంసిద్ధుడై ఇలా ప్రతిజ్ఞ చేశాడు.

తే॥ **శూలి సేకొన్న తపమెల్ల నాలిసేసి**
**యతని దేహంబునందు సామాలిఁజేసి**
**కామ కింకరుఁ జేసి, నాకడిమి నెఱపఁ**
**గంటి, నీ ప్రస్తవము దీర్పఁగంటి నెలమి.-4-53**

'శివుని తపస్సును గేలి చేస్తాను. అతని దేహార్ధాన్ని స్త్రీగా చేస్తాను. శంకరుని కామకింకరునిగా మారుస్తాను. నా ప్రతాపం చూపించి నీ కోరిక నెరవేరుస్తాను' అని ప్రగల్భిస్తాడు మన్మథుడు ఈ పద్యంలో! భావ చతురతతో పాటు, ఆలి చెయ్యడం, సామాలి చెయ్యడం అనే పదబంధాల కూర్పు, నన్నెచోడుని అచ్చతెలుగు ప్రాభవాన్ని చెబుతాయి.

తపస్సు చేస్తున్న శివునిలో కామవికారాలు ఏర్పడ్డాయి. ఎదురుగా మన్మథుడు కనిపించాడు. వెంటనే మూడవ కన్ను విప్పిచూశాడు. తక్షణం మన్మథుడు కాలి బూడిదయ్యాడు.

క. **కని కోపించెనొ, కానక**
**మును కోపించెనొ, మహోగ్రముగ నుగ్రుఁడు చూ**
**చినఁ గాలెనొ, చూడక యట**
**మును గాలెనొ, నాఁగ నిమిషమున నఱఁ గాలెన్-5-51**

ఈ పద్యం చోడుని ప్రతిభకు నిలువుటద్దం. మూడోకన్ను తెరచిన వెంటనే 'అఱగాలెన్' అంటే సంపూర్ణంగా కాలిపోయాడట. నిమిషమున అంటే కనురెప్ప వేసినంత సేపట్లో!

క. **గిరిసుత మైఁ గామాగ్నియు,**
**హరు మై రోషాగ్నియుం, దదంగజు మై ను**
**ద్ధుర కాలాగ్నియు, రతి మై**
**నురు శోకాగ్నియును రగిలి యొక్కట నెగసెన్-5-52**

పార్వతి ఒంటినుండి కామాగ్ని, శివుడి నుండి రోషాగ్ని, మన్మథుని నుండి భయంకరమైన కాలాగ్ని, రతిదేవి నుండి శోకాగ్ని ఇలా ఆ ప్రాంతంలో ఒకేసారి నాలుగగ్నులూ ఏకమై భగ్గుమన్నాయట! నన్నెచోడుని ఊహాశాలిత్వం గొప్పది.

శబరకామిని తన సవరగూడలో పటికరాతితో చేసిన రోటిలో వెదురుబియ్యం పోసి దంచుతూ, జంతువులు చుట్టుముట్టి ఉండగా, జంగమ మల్లికార్జునుని గుణగానం చేస్తుందట.

చ. **పటికపు ఱోల ముల్వెదురుఁ బ్రా లొగిఁ బోయుచు, గౌరు కొమ్ము రోఁ**
**కటఁగొని దంచుచున్, శబరకామిని పెక్కులు రాగముల్ మదో**
**త్కటముగఁ బాడెఁ జుట్టిన మృగంబులు సోమ, మనుష్యరూప ధూ**
**ర్జటి, మునిముఖ్యలోక గురు, జంగమ లింగము మల్లికార్జునన్-6-47**

ఈ అటవీవర్ణన అత్యంత రమణీయం. పార్వతితోపాటు మనం కూడా ఆ అడవిలో సంచరిస్తున్న అనుభూతి కలుగుతుంది.

ఆ. **అనుభవించి తనిసి యట మఱి విషయముల్**
**విడుతునని తలంచు వెడఁగుఁ దలఁపు**
**లఖిల శిఖి శిఖాలి యందింధనాజ్యముల్**
**గమియవైచి యార్పఁ గడఁగు నట్లు-6-69**

'కోర్కెలను తీర్చుకున్న తరువాత మోక్షంకోసం తపస్సు చెయ్యవచ్చు' అని అనుకోవడ మంటే, కర్రలు, నెయ్యితో మండించిన తరువాత దానిని ఆర్పాలను కొన్నట్లే! అని ఉపమిస్తాడు. నన్నెచోడుని అలంకారాలు కావ్యాన్ని చక్కగా అలంకరిస్తాయి. చదువరుల మనస్సులను అలరిస్తాయి.

భయంకరమైన వేసవివేళ పంచాగ్ని మధ్యలో నిలిచి, పార్వతి శివునికోసం తపస్సు చేసింది. ఆ వేడికి సప్త సముద్రాలూ వేడిపెనం మీద పోసిన నీళ్ళులాగ ఆవిరైపోయాయట. మూసలోని బంగారంలా బంగారు పర్వతం నీరైపోయిందట.

క. **వనరాశు లేడు నుప్పరి**
**పెనమున నీరులును బోలెఁ బెల్లున నుడిగెన్;**
**గనకాద్రి క్రోవిలోపలి**
**కనకంబును బోలె నీరుగాఁ గరఁగె వడిన్-6-155**

మరొక అద్భుతోపమ.

క. **తమకంబున నరుగు మరా**
**ళము లంబుద రవము విని చలాచలమతి సం**
**గము వాసినట్లు నవసం**
**గమ మిరువురు వదలి చతురికావచన గతిన్-7-75**

చతురికవచ్చి హిమవంతుని సందేశాన్ని చెప్పగానే, ఆకాశంలో హాయిగా గమిస్తున్న హంసల గుంపు మేఘధ్వని వినగానే చెల్లాచెదరైనట్టు, పార్వతీపరమేశ్వరులు విడిపోయారట.

క. **తేనియ ముసురో? యమృతపు**
**వానయొ? పుండ్రేక్షురసము వఱ్ఱొడి పెల్లో?**
**నా నలిఁ దుంబురు నారద**
**గానరసం బభవు నోలగంబునఁ బర్వెన్! -9-36**

తుంబురు నారద గానం తేనెచినుకుల ముసురా? అమృతవర్షమా? చెఱకురస ప్రవాహమా? అన్నట్టుందట. చక్కటి ఉత్ప్రేక్ష.

తే.గీ. **అగ్ని గర్భుఁడై కృత్తికలందుఁ బుట్టి**
**కొలన విడువఁబడి మగిడి గుహుఁడు వచ్చి**
**పార్వతీదేవి చన్నుల పాలు గుడిచెఁ**
**బాలు గలవారి నెమ్మెయిఁ బాపనగునె?-10-82**

ఈపద్యంలో ఒక నిత్యసత్యాన్ని చెప్పాడు అర్థాంతరన్యాసలో కవి. కుమారస్వామి అగ్నిగర్భంనుండి కృత్తికలలో జన్మించడం, తరువాత కొలనులో విడువబడడం, చివరికి లోకమాతయైన పార్వతీదేవి స్తన్యాన్ని తాగ గలగడం గొప్పవిషయం అని చెబుతూ, అదృష్టవంతుల్ని ఏవిధంగానైనా చెరపగలమా? అని ముక్తాయిస్తాడు.

కం॥ **ఇనుఁడు దయింపక ముందఱ**
**ఘనముగ వర్తించుఁ దారక ప్రభ గా క**
**య్యినుఁ డుదయించిన పిమ్మటఁ**
**గనుఁగొన లోకమునఁ దారకప్రభ కలదే? -10-152**

కుమారస్వామి దూత సుమతి, తారకాసురుని వద్దకు రాయబారిగా వెళ్ళి ఈపద్యాన్ని వినిపిస్తాడు. సూర్యుడు ఉదయించక ముందర నక్షత్రాలకు ప్రకాశం ఉంటుంది గాని, ఉదయించిన తరువాత ఉంటుందా? అని అంటాడు. ఇనుడు=సూర్యుడు, రాజు అనే రెండర్థాలు. తారక అనగా నక్షత్రం, తారకాసురుడు అని రెండర్థాలు. ఇక్కడ రాజు అంటే కుమారస్వామి. ఇది శ్లేషతో కూడిన అర్థాంతరన్యాసం.

క. **తానేలవచ్చు భూసతి**
**మానవపతి చరిత నీతిమార్గంబైనన్**
**తానేలవచ్చు భూసతి**
**మానవపతి చరిత నీతిమార్గంబైనన్! -10-181**

మొదటి రెండుపాదాలనే మరల రాసి నాల్గుపాదాల కందపద్యంగా మలిచి తమాషా చేసి చూపించాడు నన్నెచోడుడు. రాజు నీతిమంతుడైతే భూమిని ఏలవచ్చు ఇది మొదటి సగంయొక్క అర్థం. ప్రజల్ని బాధపెడితే భూదేవి అతని వద్దకు ఎందుకు వస్తుంది? అని రెండవ సగాన్ని ప్రశ్నార్థకంగా ముగించాడు. తాను ఏలవచ్చు, తానేలవచ్చు? అని రెండుకాల అన్వయం. చరితన్+ ఈతిమార్గం అనిచివరిపాద సమాసాన్ని విడదీసుకోవాలి. మొదటిది సగభాగం సాధారణ నీతి. రెండవది దానికి వ్యతిరేకమైన ప్రశ్నార్థకం. శ్లేష, రూపకం!

క. **తలఁచిన డెందము కందును,**
**బలికిన నోరెల్లఁబొక్కుఁ, బ్రభసూచిన రె**
**ప్పలు కమరు నసఁగఁ, బటుతర**
**విలయానలభాతి నెండ వేసవిఁ గాఁచెన్-6-135**

వేసవిఎండ వేడి తగలగానే శరీరభాగాలు కందడం, పొక్కడం, కమరడం వాస్తవం. హృదయంతో తలుస్తాం. తలిస్తే హృదయం కందిపోయిందన్న చోడునిభావన అధివాస్తవికత. ఎండతీవ్రతను నోటితో పలుకుతాం. ఎండగురించి చెప్పగానే నోరు పొక్కిందనడం అధివాస్తవికత. కంటితో ఎండను చూస్తాం. చూడగానే కను రెప్పలు కమిరాయి అనడం అధివాస్తవికత. అందుచేతనే స్రియలిస్టిక్ రచనఇది అని బేతవోలు రామబ్రహ్మంగారు కొనియాడారు. నన్నెచోడుని ప్రతిభా పరాకాష్ఠతకు ఈ పద్యం నికషోపలం.

ఇలా రాసుకుంటూ పోతే ఈ కావ్యంలో ఇలాంటి పద్యాలు కోకొల్లలుగా దర్శన మిస్తాయి. సూర్యాస్తమయ, చంద్రోదయ, అంధకార వర్ణనలతోపాటు అడవిని, ఆటవికులను, తపోవనాన్ని రసవత్తరంగా రాశాడు. రాత్రిపూట వేశ్యవాటికల్ని కళ్ళకు కట్టించాడు. విటవిటీ వర్ణనచేశాడు. వేశ్యమాత మాయల్ని వర్ణించాడు. ప్రేయసీ ప్రియుల సరసాలు, కళ్యాణమండప వర్ణన, వధూవరుల వర్ణన చేశాడు. విట విదూషకాదుల హాస్యోక్తుల్ని వర్ణించాడు. ఆంధ్రసాహిత్యంలో యుద్ధవర్ణన నన్నెచోడుడు చేసినంతగా, సహజంగా చిత్రీకరించిన మరొక కవి లేడని చెప్పవచ్చు. రాజకవి కదా! సుదీర్ఘమై 12 ఆశ్వాసాలలో, 2010 గద్య పద్యాలతో, చిక్కని కథతో కూడిన మరో ప్రబంధం తెలుగుసాహిత్యంలో లేదు. ప్రబంధ లక్షణాలను తొలిగా చెప్పి, చక్కటి ప్రబంధాన్ని అందించిన తొలి తెలుగుకవి నన్నెచోడుడు. అందుకే ఆరుద్ర తన సమగ్ర ఆంధ్రసాహిత్యంలో, కుమారసంభవాన్ని "అది మన ప్రప్రథమ స్రదసబంధుర ప్రబంధం' అని ప్రశంసిస్తూ, నన్నెచోడుని వ్యాసాన్ని ముగించారు.

# ఛిద్రం వినా కుడ్యం

(ఉగాది సాహిత్య పోటీలో విజేతగా నిలిచిన కథ)

శ్రీనివాస్ బారు (జార్జియా, యూ.ఎస్.ఎ)

రాత్రి పదకొండు గంటలు. ఐపాడ్లో న్యూస్ చదివి పడుకో పోతుంటే ఫోన్ మోగింది. ఆస్ట్రేలియా నుంచి అమెరికా వరకు సాగే ఐటీ కంపెనీల్లో సీనియర్ ఉద్యోగులకు 24 గంటలూ పనే. కస్టమర్లకి, తన దగ్గర పనిచేసే ఉద్యోగులకి ఇద్దరికి అందుబాటులో ఉండడం తప్పనిసరి. బద్ధకిస్తూనే ఫోన్ తీసాను.

"ప్రసాద్. కంగ్రాట్యులేషన్స్. ఎ వెరీ గుడ్ న్యూస్." మా ఇండియా సీఈఓ రావుగారి ఫోన్. నిద్ర, బద్ధకం ఎగిరిపోయాయి.

"ఈజీ కంపెనీ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ కోసం ఇష్యూ చేసిన ఆరఫ్పీలో మనను షార్ట్ లిస్ట్ చేసారు. నాలుగు కంపెనీలను షార్ట్ లిస్ట్ చేసారు. అందులో కనీసం ఇద్దరికీ ఈ ప్రాజెక్ట్ అవార్డు చేస్తారు. అంటే కనీసం 100 నుంచి 200 మిలియన్ డాలర్ల రెవిన్యూ అన్నమాట!"

"వండర్ఫుల్ న్యూస్ సర్. కంగ్రాట్యులేషన్స్ టు యూ టూ. నెక్స్ట్ స్టెప్స్ ఏమిటి సర్?" నా కంఠంలో ఆత్రుత నాకు కూడా వినపడుతోంది.

"టూ వీక్స్ ఫ్రమ్ నౌ, మండే కస్టమర్ టీం విసిట్ ఉంది. కాబట్టి, విజిట్ ఎంత బాగా ప్లాన్ చేస్తామో, వాళ్ళ పర్సెప్షన్ కూడా అంత మంచిగా మేనేజ్ చేయాలి. ముఖ్యంగా నువ్వు. డోంట్ గెట్ కేరీడ్ అవే. ఎమోషన్స్ కొంచెం కంట్రోల్లో ఉంచుకో. ఈ ట్రిప్ బాగా జరిగితే, తప్పకుండా మనకీ కాంట్రాక్టు వస్తుంది. నీ చేతుల్లో పెడుతున్నాను." రావుగారు ముగించారు.

ఇండియాలో కాళ్ళూనుకుని పెద్ద ప్లానులు ఉన్న ఐటీ కంపెనీలలో మాది ఒకటి. ఈ ప్రాజెక్టును గెలువగలిగితే, మా కంపెనీ పురోగమనంలో కొత్త పుంతలు తొక్కినట్టే. ఇండియాలో మాకున్న ఆఫీసుల్లో అతి పెద్దది హైదరాబాద్. మా ఆటోమోటివ్, ఏరోస్పేస్ కస్టమర్ల ప్రాజెక్టులకి వీపీగా నాది బాధ్యత. కొత్త ప్రోజెక్టులను గెలువడంలో కూడా నేను ముఖ్యమైన పాత్ర వహించవలసి ఉంటుంది.

మరుసటి రోజు ఆఫీసులో అన్ని డిపార్టుమెంట్ల వారిని సమావేశ పరిచాను.

"ఫ్రెండ్స్, మనకొక అద్భుతమైన అవకాశం, అంతకు మించిన సవాలు వారం రోజుల్లో ఎదురౌతున్నాయి. ఈజీ వారి గ్లోబల్ టెండర్లో మనం షార్ట్ లిస్ట్ అయ్యాము. ఈజీ కంపెనీ వచ్చే సోమవారం వారి ప్రతినిధులను మన కంపెనీకి పంపుతోంది. వారు రెండు రోజులు మనతో గడుపుతారు. వాళ్ళిక్కడ ఉండే ప్రతి గంటను మనం క్షుణ్ణంగా ప్లాన్ చేయాలి. యంగ్ టాలెంట్ ముందు వరసలో, ముఖ్యంగా, విమెన్, ఉండేటట్లు చూడండి. "ప్రతి వ్యక్తికీ వారి వారి బాధ్యతలను అప్పగిస్తూ మీటింగ్ ముగించాను.

వారం రోజులు మా సన్నాహాలు అవిశ్రాంతంగా సాగాయి. అనుకున్న రోజు రానే వచ్చింది. ముంబై నుంచి ఇండిగోలో ఉదయం 9.30కి వారి రాక. సూట్, వైట్ షర్టుతో కారులో 7.30కల్లా అమీర్పేటలో బయలుదేరాను. అప్పుడు ట్రాఫిక్ ఉండదు కాబట్టి గంటలో ఆఫీస్ చేరుకుంటానని నా అంచనా. ఎస్సీ హాస్పిటల్ వచ్చేవరకు ట్రాఫిక్ మొత్తం జామ్ అయిపోయి ఉంది.

బస్సుల నుంచి, కార్ల నుంచి జనం అసహనంగా బయటకు చూస్తున్నారు. ఒక కిమీ ముందర కూరగాయల లారీ పక్కకు ఒరిగి కూరలన్నీ రోడ్డు పాలవ్వడం వల్ల పక్కనే ఎవరో అంటున్నారు. పోలీసులెవరూ డ్యూటీలో కనపడలేదు. పరిస్థితి గందరగోళంగా ఉంది. ప్రతి నిమిషం ఎంత ముఖ్యమో తెలిసినా, ఏమీ చేయలేని అసహాయ స్థితి. నాలో చిరాకు ప్రతి నిమిషానికి పెరుగుతున్నది.

ఒక గంట తర్వాత కార్లు చిన్నగా కదలడం మొదలు పెట్టాయి. ట్రాఫిక్ జామ్ దాటి, 5కిమీ వేగాన ఆఫీస్ కాంపౌండులో కారు తిప్పేసరికి సుమారు 9:20 కావస్తున్నది. మెయిన్ పోర్టికోలో కస్టమర్లు వచ్చే పెద్ద కార్లేవి.

కనపడలేదు. ఊపిరి పీల్చుకుని కారును కాస్త వేగంగా సి.ఎఫ్.ఓ పార్కింగ్ లాటులో ఆపాను. సి.ఎఫ్.ఓ కళ్యాణరామన్ ఊళ్ళో లేదని నాకు తెలుసు. కార్ పార్క్ చేసి దిగబోతుండగా, నేను పేరు ఎరగని సెక్యూరిటీ గార్డ్ తలుపుకు అడ్డంగా నిలుచున్నాడు.

"ఇదర్ ఆప్ పార్క్ నహీ కర్ సక్తే సాబ్"

"హమే మాలూం హాయ్ " విండో దించి దాదాపు అరుస్తూ కార్ దిగబోయాను.

నా స్థాయి కానీ, ఆ రోజు కార్యాక్రమపు ప్రాముఖ్యత కానీ తెలియని గార్డ్ ఒక అంగుళం కూడా కదల్లేదు. రెండు, మూడు సార్లు చెప్పినా వినిపించుకోవటం లేదు గార్డ్.

"దూస్రే జగహ్ పే జాయియే" అంటూ చెయ్యి ఎత్తి ఎటో చూపిస్తున్నాడు.

కార్ డోర్ విసురుగా గార్డుకు తాకేటట్లు తెరిచి కిందకు దిగాను. పెదవులు అదురుతున్నాయి. కోపంతో నా వొళ్ళు ఊగిపోతోంది. వాడి ముఖంలో ముఖం పెట్టి అరవసాగాను.

"దో కౌడికా నౌకర్. కహాఁ సే ఆయా తూ? నీ ఏజెన్సీ కాంట్రాక్టు కాన్సల్ చేయకపోతే చూడు. సాయంత్రం వరకు నీ యూనిఫామ్ విప్పి నిన్ను రోడ్డు మీద నిలపెడతాను."

నా తిట్ల ప్రవాహం కొనసాగింది. కదలకుండా నిల్చున్న గార్డును ఏమి చేయలేక మాట ఒకటి రెండు సార్లు అనగూడని మాట అన్నానని నా అనుమానం. ఆఫీసుకు అప్పుడే వస్తున్నవారికి ఇదివరకే ఉన్నవారు జరిగిన కథను టూకీగా వినిపిస్తున్నారు. నేను పక్కకు తిరిగి చూసేటప్పటికి, సీఈఓ రావుగారి కారు నా పక్కన ఆగి ఉంది.

"ఏమైంది" ఆతృతగా అడిగారు ఆయన.

"నేను కల్యాణరామన్ స్పాట్లో పార్క్ చేస్తుంటే, నన్ను ఆపుతున్నాడు సర్. వీడ్ని, వీడి ఏజెన్సీని ఇవాళే డిస్మిస్ చేయండి!"

"సాబ్, మై తో సిర్ఫ్ ఏ రెసెర్వ్డ్ బోల్ రహా థా. ఏ సాబ్ ముఝే మా బాప్ కా గాలియా దే రహే హై." గార్డ్ అందుకున్నాడు.

కారు దిగిన రావుగారు గార్డ్ భుజం మీద చేయి వేసి "మిశ్రాజీ, ఆప్ ఫికర్ న కరో. మై బాత్ కరూంగా. ఆప్ మేరే ఆఫీసుమే ఆనా" అంటూ నన్ను తన కేబిన్ లోకి రమ్మని సైగ చేస్తూ వడివడిగా నడిచారు.

"తిట్టావన్న కోపంతో ఎంప్లాయిస్ ముందు మిశ్రా నిన్ను ఒక్క దెబ్బ వేస్తె ఏం చేసేవాడివి?"అరిచారు రావు లోపల.

"మొత్తం సెక్యూరిటీ స్టాఫ్ అందరు ఇప్పుడు ఆఫీసు ముందర ధర్నా చేసి కస్టమర్ లోపలకు రాకుండా చేస్తే ఏం చేద్దాం ?"

ఆ మాట వినగానే నా గుండె జారిపోయింది.

"నీ అంత చదువుకోలేదు. డబ్బు లేదు. వందల మైళ్ళ దూరం నుంచి పొట్ట చేతిలో పట్టుకొని వచ్చిన అర్భకుడిని అనరాని మాటలు అనడానికి నీకు ఏ అధికారం వుందను కుంటున్నావు ?" రావు అడిగిన ప్రశ్నకు మౌనంగా ఉండి పోయాను నేను. నన్ను సర్దిపుచ్చుతారు అనుకున్నా కానీ, మిశ్రా పక్షం వహించి నన్నే కడిగేస్తారని నేను ఊహించలేదు.

"అనువు కాని చోట అధికులమనరాదు అన్నారు కానీ అనువైన చోట ఇంకా జాగ్రత్తగా ఉండాలని నీకు ఎవరూ చెప్పలేదా? స్థాయి పెరిగినా కొద్దీ బాధ్యత పెరుగుతుందని నీకు తెలియదా?" తలవంచుకు కూచున్నాను నేను.

"ప్రసాద్, ఇవాళ ఈజీ కంపెనీ విసిట్ నువ్వు నిర్వహించడానికి వీల్లేదు. మానసికంగా నువ్వు సరైన స్థితిలో లేవని నా అభిప్రాయం. నేను ముఖర్జీకి ఇప్పుడే కాల్ చేస్తాను. హి విల్ హ్యాండిల్ ఇట్."

"రియల్లీ సారీ సర్" గొణిగాను నేను.

"సారీ చెప్పవలసింది నాకు కాదు మిశ్రాకు" నాకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా మిశ్రాను లోపలికి పంపమని సెక్రటరీకి చెప్పారు రావు. సెల్యూట్ పెట్టి నిలుచున్నాడు మిశ్రా.

"ఏ సాబ్ ఆప్ సే మాఫీ మాంగ్నా చాహతే హై" రావు నన్ను చూస్తూ అన్నాడు.

అన్యమనస్కంగా "ముఝే మాఫ్ కరో" అన్నాను నేను.

మిశ్రా ముఖం పూర్తిగా చిన్న పోయింది. కానీ ఉద్వేగంతో, బలవంతంగా ఆపుకున్న కళ్ళనిండా నీళ్లతో మా ముందు నిల్చున్నాడు. ఇక్కడితో దీన్ని మర్చిపోమని రావు అతన్ని రెండు చేతులు జోడించి అడిగారు. తల కొట్టేసినట్లు అయ్యింది నాకు.

కళ్ళ నుంచి జారే నీటి చుక్కలు చేతితో తుడుచుకొని "ఠీక్ హయ్ సాబ్" అంటూ సెల్యూట్ కొట్టి బయటకు నడిచాడు మిశ్రా.

క్యాబిన్లో ఒక్క నిమిషం నేను భరించలేని మౌనం.

"సప్త వ్యసనాలు తెలుసా నీకు? తాగుడు, జూదం ఇవి చాలా పెద్ద విషయాలు అనుకుంటారు ఎంతోమంది. నీకు తెలుసో లేదో, ఇతరులు బాధపడేటట్లు మాట్లాడడం కూడా సప్తవ్యసనాలలో ఒకటి. డబ్బు అధికారము ఉండటం వల్లనో, అవతల వ్యక్తి మంచితనంతో నోరు ఎత్తకపోవడం వల్లనో నువ్వు ఈ క్రూరమైన పనిని నువ్వు చాలా రోజులుగా కొనసాగిస్తున్నావు. అది నీకు తెలుసు. నాకు తెలుసు. ఈ నీ వ్యసనంతో, నీ కుటుంబం ఏమో కానీ, ఆఫీసులో స్టాఫ్

కూడా అమితంగా బాధపడుతున్నారు"

"మిశ్రా క్షమాపణ అంగీకరించాడు సర్. రెండు మూడు రోజుల్లో ఈ విషయం మర్చిపోతాడు." సర్ది చెప్పడానికి ప్రయత్నించాను.

గడియారం చూసుకున్న రావు "నీకు ఒక కథ చెప్పనా" అన్నారు.

"కొన్ని దశాబ్దాల క్రితం ఓ ఊళ్లో ఒక కుటుంబం ఉండేది. కుటుంబంలోని పెద్ద కొడుకుకి అకారణంగా వచ్చేది అమితమైన కోపం. ఆపైన నోరు పారేసుకునే తత్వం. ఊళ్లో ప్రతి వారితో జరుగుతున్న గొడవలు భరించలేని తండ్రి, కొడుకు కోపాన్ని అదుపులో పెట్టడానికి ఓ మార్గం కనిపెట్టాడు. కొడుకుని పిలిచి పెద్ద మేకులు ఒక వంద ఇచ్చి, కోపంతో ఎవరినైనా తిట్టిన ప్రతిసారి ఇంటి వెనక దొడ్లో ఉన్న తెల్ల గోడకు పెద్ద మేకును లోపలి దాకా కొట్టమన్నాడు. రోజులు వారాలు గడుస్తున్నాయి. వారానికి నాలుగు మేకులు కాస్త వారానికి ఒక మేకు, రెండు వారాలకు ఒకటి, క్రమంగా నెలకొక మేకు మాత్రమే కొట్టే స్థాయికి చేరాడు కొడుకు. తన పురోగతికి వాడికి బోలెడు సంతోషం వేసింది. తండ్రిని పిలిచి గోడ చూపించి "చూసావా వారానికి నాలుగు మేకుల నుంచి నెలకు ఒక మేకు దాకా వచ్చాను." అని గర్వంగా అన్నాడు. తండ్రి ఏమి మాట్లాడలేదు. నెమ్మదిగా గోడ దగ్గరికి పోయి, ఒక్కో మేకు లాగి కింద పడేసాడు. మేకులు అన్ని పోయాక పెచ్చులతో, రంగు పోయి, ఇటుకలు బయటకు కనబడుతూ పరమ అసహ్యంగా ఉందా గోడ.

భుజం మీద చేయి వేస్తూ అన్నారు రావు గారు "మనం మాట్లాడే కఠినమైన మాటలన్నీ గోడలోని మేకులే. పడిన బాధ ఏమిటో దెబ్బ తిన్న గోడను అడుగు. దిగిన మేకును కాదు."

కళ్ళ నిండా నీళ్లతో వెనక్కు తిరిగిన మిశ్రా ముఖం నా ముందు కదిలింది. చేయకూడని పని చేశాక, ఇంకా ఆ రోజు నాకు చేయవలిందేమి మిగలలేదు. లీవ్ పెట్టి ఇంటికొచ్చేశాను.

క్వార్టర్లీ తెలుగు పరీక్షల కోసం తెలుగు పద్యాలు బట్టీ పెడుతున్న పక్కింటి అబ్బాయి, "తనువును విరిగిన అలుగుల" అంటూ నన్నయ్యగారి పద్యం పెద్దగా చదువుతున్నాడు.

# ఆహ్వానం పలుకుదాం

**(ఉగాది సాహిత్య పోటీలో విజేతగా నిలిచిన కవిత)**

**డా. మైలవరపు లలితకుమారి (గుంటూరు, ఇండియా)**

ఆకుల్నిరాల్చే శిశిరఋతువుకి
వీడుకోలు పాడుతూ
అవనికి అందాలు
ఆనందాలను అందించాలని
ఆనందంతో ఆమని వచ్చింది
ఆకుపచ్చని పట్టుచీర కట్టుకొని
ఎర్రని చిగురులు చీరంచులు కాగా
విరిసినపుపూలు చుక్కలై మెరయ
తరువులన్నీ వయ్యారాలొలుక
మావిచిగురులు మేసిన కోయిలమ్మ
చిటారు కొమ్మన ఊయలలూగుతూ
షడ్జమంలో రాగాలాపన చేస్తుంటే
పెద్ద ముత్తయిదువ చిలుక పేరంటాలుకాగా
వేయి వెలుగుల సూరీడు
లోకానికి మేలుకొలుపులు పాడ
నీలగగనమే ఆతపత్రమై భాసింప
నింబ కుసుమాలు అక్షతలు కాగా
విరబూసిన గున్నమావి ఆధారంగా
అల్లుకుంటున్న మాధవీలతను చూసిన
పంచబాణుడు చెరకువిల్లు సవరింప
పండితులు పంచాంగ శ్రవణాలతో
రాజపూజ్య అవమానాల సంగతులతో
ఆదాయవ్యయాల లెక్కలను తెలియజేస్తూ
కవివరేణ్యుల కవిసమ్మేళనాలతో
కాలపురుషుని కదలికలతో
అమ్మవారి నామధేయమునుంచుకొని
ఆనందభైరవి రాగాలనాలపిస్తూ
భావగర్భితమైన పరాభవ నామంతో
పర పరాశక్తి శక్తి నీ
అపర మాహేశ్వర భావాన్ని నిలుపుకొని
తరలివస్తున్న వసంతునికి
ఆహ్వానం పలుకుదాం!

# తృష్ణా తీరం

(ఉగాది సాహిత్య పోటీలో ప్రశంసాపత్రం పొందిన కథ)

కావ్య అక్కినేపల్లి
మెసాచుసెట్స్, యూ.ఎస్.ఎ

అలిసిపోయి ఇంట్లోకి వస్తూనే కార్ కీస్ హోల్డర్‌కి తగిలించి హ్యాండబేగ్ సోఫాలో పడేసి తల పైకి వాల్చి కళ్ళు మూసుకొని కూర్చుంది సౌమ్య.

డైనింగ్ టేబుల్ దగ్గర పని చేసుకుంటున్నాడు భర్త రవి. "ఏంటోయ్, ఎలా జరిగింది మీ గెట్-టు-గెదర్" అని అడిగాడు. బాగానే జరిగింది అని అంది నీరసంగా.

"అది సరే! మీరేంటి ఇంకా లాప్టాప్ ముందే ఉన్నారు. పిల్లలు క్లాసులకి వెళ్ళలేదా? పూలింగ్ డ్యూటీ ఎవరిది ఇవ్వాళ? ఇంతకీ పిల్లలెక్కడ? ఇల్లంతా నిశ్శబ్దంగా ఉందే?" అని మూసుకున్న కళ్ళతోనే అడిగింది.

"పిల్లలు హోంవర్క్ చేసుకుంటున్నారు. నువ్వు ఇంట్లో లేవు కదా, ప్రశాంతంగా నా పనిచేసుకుంటున్నాను. బోలెడంత పని అయిపోయింది తెలుసా?"

"ఛా! నేనుంటే మీ పనికేం అడ్డు?"

"అడ్డు కాదు కాని, నువ్వుంటే నా టు-డూ-లిస్ట్ కాస్త టు-యు-లిస్ట్ అవుతుంది.'ఇది ఎక్కడ', 'అది ఎవరు తీశారు', 'కాఫీ కావాలి', 'అమెజాన్ ఆర్డర్స్ పెట్టాలి' అంటూ నా టాస్క్ లిస్ట్ ఆటోమేటిక్ గా అప్‌డేట్ అవుతుంది."

"అంటే నేను డిస్టర్బన్స్ అనమాట?" అంటూ కళ్ళు తెరిచింది.

"కాదులే, ఊరికే అలా అన్నాను, నిజానికి ఇవ్వాళ నువ్వు ఇంట్లో లేకుంటే బోర్ కొట్టిందోయ్!"

"సర్సర్లెండి! నేను కాఫీ పెట్టుకుంటున్న మీకు కావాలా అని అడిగింది. అయినా తాగేసారుకదా మళ్ళీ ఎందుకులే.

"అన్ని ఎక్కడివక్కడ పెట్టేసా కదా, ఎలా తెలిసిందబ్బా?" ఆశ్చర్యంగా అడిగాడు రవి

"అంతా సర్దారులే కాని, పొంగిన కాఫీ పొయ్యి మీద పడి, ఆ మరక చూసారా, ఎలా కనబడుతుందో" అని కీలకమైన కేసులో పెద్ద లా పాయింట్ పట్టుకున్నట్టు కళ్లెగరేసింది సౌమ్య.

"చిన్నమరకే కదా, మరక మంచిదేనోయ్..." అంటూ రవి ఎదో సర్దిచెప్పబోతుంటే, "అందుకే మిమల్ని వంటింట్లోకి రావద్దనేది. ఒక్క పని కూడా సరిగ్గా చెయ్యరు" అంటూ సౌమ్య... ఇలా వారి మధ్య వాదన దారిమళ్ళక ముందే పిల్లల్నితీసుకుని రవి బయటికి జారుకున్నాడు.

వేడి వేడి కాఫీతో బయట బాల్కనీలోకి నడిచింది సౌమ్య. సిప్ బై సిప్ కాఫీ తాగుతూ, స్నేహితులతో గడిపిన క్షణాలు గుర్తుచేసుకుంది.

చాలా ఏళ్ళ తరువాత ఫ్రెండ్సని కలుస్తున్నందుకు చాలా ఉషారుగా బయలుదేరింది. అనుకున్న సమయం కంటే ఒక పావుగంట ముందే వెళ్ళింది.

మంచి ఇంటీరియర్స్, లైవ్ మ్యూజిక్‌తో చాలా లైవ్లీగా ఉంది. ఒక్కొక్కళ్ళుగా అందరు వచ్చేసారు. కుశలప్రశ్నలు అయ్యాయి. పది పేజీల మెనూ చూస్తే జిహ్వ చాపల్యం పెరిగింది. కేలరీల గురించి ఆలోచించకుండా ఫుడ్ ఆర్డర్ చేసారు.

వేడివేడిగా ఆకలిని పెంచుతూ ఘుమఘుమలాడే భోజనం వచ్చేసింది. ఆహారం, ఆత్మీయ సంభాషణ రెండూ ఏకకాలంలో మిళితమవుతున్నాయి

ఈలోపు పక్కనే ఉన్న రమ్య, "ఇంక నేను బయల్దేరతానే, చాలా ఆలస్యం అయ్యింది. మా అమ్మాయిని వేరే కొత్త కోర్స్‌లో జాయిన్ చెయ్యాలి, వెళ్లి ఆ వివరాలు సేకరించాలి. చాలా రీసెర్చ్ చెయ్యాలి. ప్రస్తుతానికి ఆట-పాట, డాన్స్-స్విమ్, చెస్-మాథ్ అంటూ అన్ని నేర్పిస్తున్నాం." అంది.

"మీ పాప ఇంకా చిన్నదే కదా, అప్పుడే అన్ని క్లాసులా?" ఆశ్చర్యంగా అడిగింది సౌమ్య.

"మొన్నీమధ్యే కోడింగ్ క్యాంపు లోకూడా పెట్టాము, ఇప్పుడున్న పోటీలో నెగ్గుకురావాలన్న, ముందు-ముందు కాలేజీ అప్లికేషన్స్ లో పెట్టుకోవాలన్నా పనికొస్తాయి." అంటూ లేచి వెళ్ళిపోయింది.

ఇంకొక స్నేహితురాలు...

"మావారి ఫ్రెండ్స్ అంతా పెద్ద ఇళ్ళు, కార్లు కొనుక్కుంటున్నారు. మేము ఇంకా ఆ పాత ఇరుకు కొంపలో ఉంటే ఎం బాగుంటుందని మేము మొన్నే పెద్ద ఇల్లు కొన్నుకున్నాం, ఇంటికి తగ్గట్టుగా కారునీ మార్చేసాం." అంది.

"మేమంతా కనీసం నెలకొకసారైనా కలుస్తుంటాం. సందర్భం ఎంత చిన్నదైనా, చాలా రిచ్ గా సెలబ్రేట్ చేసుకుంటాం. ఆడవాళ్లంతా చాలా శ్రద్ధగా వస్త్రాలంకరణ, దానికి తగ్గట్టు స్వర్ణాలంకరణ చేసుకుంటారు. ఈసారి మళ్ళీ మా ఇంట్లోనే కలుస్తున్నాం, నేను కాస్త్లీగ, ట్రెండీగా కనిపించాలి. ఇక్కడే ఒక జ్యువలరీ డిజైనర్ ఉందట, గ్రాములో చూసా,యూనిక్ డిజైన్స్ అట! షాపింగ్కి వెళ్ళాలే." అని హడావిడిగా వెళ్ళిపోయింది.

మరొక ఫ్రెండు...

"ఏంటో లింక్డిన్ తెరిస్తే అందరు కెరీర్లో ఎదుగుతున్నట్లే కనిపిస్తున్నారు. మేము మాత్రం అక్కడే ఉన్న గొంగళిలా ఆగిపోయామెమో అనిపిస్తుంది. మనం ప్రగతి పథం లో నడుద్దాము అంటే, మావారు చాదస్తం తో ఒక అడుగు ముందుకు వెయ్యరు. 'అందరు రెండు కాదు, నాలుగు చేతులతో సంపాదిస్తున్నారు, మీరూ రెండో ఉద్యోగం (మూన్ లైటింగ్) వెతుక్కోండి!' అని గొప్ప సలహాలు ఇస్తుంటే, కనీసం నిమ్మకు నీరెత్తినట్లైనా ఉండదు సరికదా, తిరిగి నాకే 'అది తప్పు, వేరే వాళ్ళ అవకాశాలు మన అత్యాశ వల్ల పోతాయి,అనైతికం!' అంటూ గీతోపదేశం చేస్తారు. అది ధర్మం కాదంటారు అయన, అది నా ఖర్మం అంటాను నేను."

" 'అందరు భూగోళమంతా చుట్టి వస్తున్నారు. కనీసం, ఈసారైనా మన పెళ్లి రోజుకి యూరోప్ వెళ్దామా?' అని ఆశగా అడిగితే, 'యూరోపులు- ఊటీలు మనకెందుకే' అంటూ, 'చెలి నగుమోమే చంద్రబింబమై పగలే వెన్నెల కాయగా, సఖి నెరి చూపులు చల్లదనంతో జగమునె ఊటీ శాయగా...' అంటూ అప్పుడెప్పుడో పింగళి గారు అన్నది ఇంకా పట్టుకు వేలాడుతారు కాని కదలరు. నా కష్టాలు ఎవ్వరికి రాకూడదే!" అని చాలా అసంతృప్తి వెల్లడించింది.

ఇలాంటి కబుర్లు ఎన్నో చెప్పుకున్నారు. ఇది సంతోషంగా కలవడానికి పెట్టుకున్న గేదరింగ్ కాదనిపించింది సౌమ్యకి. ఇదేదో ఒక రేస్ మధ్యలో తీసుకున్న విరామంలాంటిది, కేవలం ఊపిరిపీల్చుకుని మళ్ళీ పరుగెత్తడానికి సిద్దపడుతున్నట్లు అనిపించింది. నవ్వుతూ అందరం గ్రూప్ పిక్ తీసుకున్నామే కానీ ఆ నవ్వుల వెనుక పోటీలు... పోల్చుకోవడాలు, అసంతృప్తి - అత్యాశలు మౌనంగా నిలబడ్డాయి.

❖ ❖ ❖

సర్వే భవంతు సుఖినః సర్వే సన్తు నిరామయాః

సర్వే భద్రాణి పశ్యన్తు మా కశ్చిత్ దుఃఖ భాగ్భవేత్

ఓం శాంతిః శాంతిః శాంతిః

అని ఏకకంఠంలో వినిపించిన శ్లోకాలకి, తేరుకొని బాహ్య ప్రపంచంలోకొచ్చింది.

పక్కింట్లో ప్రశాంతి గారు, యోగా టీచర్. పైసా పుచ్చుకోకుండా చిన్నపిల్లల నుండి పెద్దవాళ్ళదాకా అందరితో యోగా చేయిస్తారు. చాలా ఆప్యాయంగా, వివేకవంతంగా మాట్లాడతారు. పిల్లలకైనా పెద్దలకైనా ఆవిడతో యోగా కంటే కబుర్లే ఇష్టం.

ఇప్పుడే అభ్యాసం పూర్తి చేసుకొని పిల్లలు ఇళ్లకి వెళ్తున్నారు, వారి వెంట ఈవిడ బయటికి వచ్చింది

ఆవిడ సార్థకనామధేయురాలు. జీవితంలో ప్రశాంతత, మొఖంలో శాంతం ఎప్పుడు ఉట్టి పడుతుంటాయి . "హాయ్ సౌమ్యా! ఏంటి ఈవేళ కాస్త తీరికగా ఉన్నట్టున్నావు? ఒక్కదానివే కూర్చొని కాఫీ తాగుతున్నావు!" ఖాళీ ఉంటే ఇంటికి రామ్మా ఓసారి. రెండు రోజుల నుండి మా లాప్టాప్ ఓపెన్ అవ్వనని మోరాయిస్తుంది, అదేంటో చూసిపెట్టు కాస్త".

ప్రశాంతి గారంటే సౌమ్యకి చాలా ఇష్టం. ఆవిడ పిలవగానే వెళ్ళింది. మాటల మధ్యలో సౌమ్య చాలా రోజుల తర్వాత తన స్నేహితురాళ్ళని కలిశానని, వాళ్ళని కలిసిన ఆనందం కంటే కలిసాక ఎన్నో ప్రశ్నలతో మది నిండిపోయినట్లు అనిపించింది అని చెప్పింది .తెలిసో తెలియకనో అందరం ఒకే ఆట ఆడుతూ అలసిపోతున్నాం అని నిట్టూర్చింది.

టేబుల్ మీద ఉన్న లాప్టాప్ తీసుకుంటూ "ఆంటీ మిమ్మల్ని ఒక ప్రశ్న అడగనా..." అని.

ప్రశాంతి గారు 'ఆ', 'ఊ' అనే లోపే సౌమ్య మాట్లాడటం మొదలుపెట్టింది

"పెద్ద జీతం, మంచి జీవితం, సమాజంలో హోదా, లగ్జరీలూ అన్ని ఉన్నాయి. అయినా ఎదో వెలితి. ఇన్ని ఉన్నా ఇంకేదో కావాలన్న ఆరాటం, ఎక్కడో ఆత్మనూన్యతా భావం.

ఎందుకు అలా అనిపిస్తోంది?" అని అడిగింది.

ప్రశాంతి గారు చిరునవ్వుతో,

"నువ్వే చెప్పు...ఎంత సంపాదిస్తే సంపాదించినట్టు? ఎంత కూడబెట్టాక ఇంక చాలు అనిపిస్తుంది? ఎన్ని డిగ్రీలు ఉంటే పిల్లలు వృద్ధిలో కొచ్చినట్టు? ఎన్ని ప్రొమోషన్స్ వస్తే వృత్తి లో ఎదిగినట్టు? విజయవంతమైన జీవితానికి ఏది కొలత, ఈ తృష్ణలకి తీరం ఎక్కడ?"

ప్రశాంతి గారు వేసే ఒక్కో ప్రశ్నకు సమాధానం ఏంటో తెలియక, అసలు జవాబు లేని ప్రశ్నకు మౌనమే సమాధానంగా – నిజమే కదా, అంతు ఎక్కడ అనే ఆలోచనలో పడింది.

"మరి మీకెప్పుడూ ఇలాంటి ఆలోచనలు రాలేదా? అందరితో పరుగెత్తాలి , లేకపోతే వెనకపడిపోతున్నానేమో అనే ఆలోచన మీకు లేదా?" అని మళ్ళీ అడిగింది సౌమ్య

"చాలా సార్లు ఇలాంటి ఆలోచనలు మాకూ వచ్చాయి. అన్ని విధాలుగా బాగున్నాకూడా, ఎక్కువ జీతం కోసం వెంపర్లాట, వేరే ఉద్యోగం వెతుక్కోవాలా?మాతోటి వారితో పోలిస్తే మేమేపాటి? పిల్లలకు మంచి మార్గదర్శకులమా మనం? ఇలా ఎన్నో అనుమానాలు, ఆలోచనలు ఒక దశలో అందరికి సహజమే...

కాని ఇలాంటి ప్రశ్నలు మమల్ని లోతుగా ఆలోచింపచేసాయి. ఆశలు, ఆరాటాలు పక్కన పెట్టి, అప్పుడున్న మా అవసరాలని గుర్తించాము. అలా అని ఎక్కడా కూడా రాజీ పడలేదు.పిల్లలకు మంచి విద్య, వాళ్ల భవిష్యత్తుకు బలమైన పునాది వేసాము. వాళ్ళ చదువులోనూ, పెళ్లిళ్లలోనూ లోటు లేకుండా చూసుకున్నాం.

మా సామర్థ్యానికి మించి ఆర్భాటం చెయ్యలేదు. అందరిలాగా మేము కూడా అన్నిసౌకర్యాలతో ఉండే ఇల్లు, కారు సంపాదించుకున్నాం. చిన్న స్థాయి ఉద్యోగం నుండి అంచలంచలుగా ఎదిగే ఆరాటంలో మమల్ని మేము కోల్పోయిన సందర్భాలు ఎన్నో! సంసారంలో సారం లేదనిపించింది. అప్పుడు అర్థంఅయ్యింది, సంపాదన అవసరాలని తీరుస్తుందే తప్ప ఆనందానికి కారణం కాదని.

కాని ఇవన్నీ మన బాధ్యతలు మాత్రమే. రోల్ ప్లే అన్నమాట. వాటితో మమేకం అవ్వకుండా, జన్మతః ప్రతి మనిషికి సహజంగా ఎదో ఒక విభూతి దేవుడు ప్రసాదిస్తాడు. అది పరుల కోసం వినియోగించినప్పుడు, సంఘానికి మనం ఉపయోగపడ్డప్పుడు, మన అనుకున్న వారి ఎదుగుదలలో చేతనైన సహాయం చేసినప్పుడు వచ్చే ఆనందం మాటలకి అందదు. అది మనం పోగేసుకునే వస్తువుల్లో దొరకదు.

భక్తి, ధ్యానం, యోగా, లలితకళల పట్ల ఆసక్తి, ఇవన్నీ మనసుకి, శరీరానికి అలవాటు చెయ్యాలి. అవి మదిలో ఎడతెరపి లేకుండా పుట్టుకొచ్చే సంకల్పాలని నియంత్రించేందుకు సహాయపడుతాయి.

మనస్సు అనే ఆసనం మీద తృప్తి అనే భావాన్ని స్థిరంగా ఉంచితే, చేసే ప్రతి పని సంతృప్తిగా ఉంటుంది. మనం పాటించే విలువలే, మన వ్యక్తిత్వమే మన గౌరవానికి కారణమవ్వాలి.

ఇలా ప్రశాంతి గారు జ్ఞానబోధ చేస్తుండగా సౌమ్య చేతిలో ఫోన్ మొగింది. గంటలో ఇంట్లో ఉంటామని చెప్పాడు రవి.

సౌమ్య ప్రశాంతి గారి లాప్టాప్ని రీబూట్ చేసింది.

ప్రశాంతి గారు సౌమ్య ఆలోచనల్ని రీబూట్ చేసింది.

పిల్లల కోసం ఎప్పటి లాగా రెడీ మేడ్ ఫుడ్ కాకుండా వాళ్ళ కోసం వంట చెయ్యాలనిపించింది సౌమ్యకి. అమ్మ వంటను మెచ్చుకుంటూ ఎంతో ఇష్టంగా, ఆస్వాదిస్తూ తింటున్నారు. "రేపు ఇదే చెయ్యి" అని ఆర్డర్ కూడా వేశారు. పిల్లల అమాయకపు ప్రేమలో, వారి సంతోషంలో సౌమ్యకు నిజమైన తృప్తి లభించింది.

# వలస పక్షులు

(ఉగాది సాహిత్య పోటీలో ప్రశంశాపత్రం పొందిన కవిత)

మురళి పసుమర్తి
మెసాచుసెట్స్, యూ.ఎస్.ఎ

ఆశలకు రెక్కలు కట్టుకుని
అశయాలను అవకాశాలుగా మలచుకుని
ఆత్మీయులకు దూరంగా
అందరి అభిమానం
ఆశీస్సులుగా మూటగట్టుకుని
రెండు పెట్టెలతో
రెట్టింపైన ఉత్సాహంతో
ఆకాశమార్గాన రెండు ఖండాలను దాటుకుని
అవకాశాల స్వర్గధామంలో అడుగిడి
బిక్కు బిక్కున బిక్కర చెందుతూ
అక్కునచేర్చుకునే వారు లేక
ఆదరణకు దూరమవుతూ
వడి వడిగా అడుగులువేస్తూ
ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిచుకుంటూ
మెట్టుపై పైమెట్టునెక్కి
ఉన్నత శిఖరాలను అధిరోహించి
ఒకరిగా మొదలయిన ప్రయాణాన
ఏడడుగులతో భాగస్వామిని జతచేర్చుకుని
ఆర్ధికంగా నిలదొక్కుకుని
ఇల్లు పిల్లలను బలపర్చుకుని
కుటుంబ బంధాన్ని
గౌరవప్రదంగా పెంపొందించుకుంటూ
సమాజంతో మమేకమై
భరతసంస్కృతీ సాంప్రదాయాలను
అమెరికా సంయుక్త రాష్ట్రాలలో
ఉన్నత సమూహంగా నిలబెట్టినా

ఎక్కడో ఏదో వెలితి
వృద్ధాప్య సమయాన
తల్లితండ్రులకు అందుబాటులో లేననో
అయిన వారికి దూరం ఉన్నాననో
యుక్తవయసు పిల్లలు
మద్యవయసు భరువు భాద్యతల నడుమ
మనిషిగా అమెరికాలో ఉన్నా
మనసు మాత్రం ఎల్లవేళలా
పుట్టిన ఊరు పెరిగిన ప్రాంతంలో
మూలమూలన తిరుగుతూ
మనసు లోలోపల దాగిన స్మృతులను
నిరంతరం నివృత్తి చేసుకుంటూ
నలుగురితో ఉన్నా నలుదిక్కులా పయనిస్తున్నా
ఒంటరితనపు నిశీధి చాయలు వెంటాడేస్తున్నాయి
ఆత్మీయుల ఇంట శుభకార్యమయినా
అయినవారికి ఆరోగ్యసమస్యలు ఎదురయినా
సుదూరసాధనానికే పరిమితమై
నిస్సహాయత నివురుగప్పి
నిస్పృహతో జడత్వాన్ని ప్రదర్శిస్తూ
జీవన గమనాన్ని వెళ్ళదీస్తున్న
ప్రతి ప్రవాసజీవి పక్షి అయినా బాగుండు
ప్రతివసంతానికి సొంతగూటికి
పయనించి తనివితీరా
తన్మయత్వంతో తమ తమ వారితో
అనుక్షణం ఆనందమయం.

# ఏ.ఐ - శక్తా?, శాపమా?

సిద్ధార్థ వింజామరం
ఫౌండర్ - స్వాహి (లెక్సింగ్టన్, మెసాచుసెట్స్, యూ.ఎస్.ఎ)

ఏఐ గురించి వచ్చే ప్రతి ఆర్టికల్ ఒక హెచ్చరిక తో మొదలవుతుంది. రోబోట్లు వస్తున్నాయి. జాబ్స్ పోతాయి. మనకు తెలిసిన ప్రపంచం అంతమవుతోంది గట్రా. ఇది అలాంటి ఆర్టికల్ కాదు.

## ఏ.ఐ, ఎమ్.ఎల్, జెన్ ఏ.ఐ, ఏ.జీ.ఐ... ఏంటి ఇవన్నీ?

ఏఐ టెక్నాలజీ వేగంగా ముందుకు సాగుతోంది, దాన్ని ఎలా వాడుకోవాలో నేర్చుకోవడం మన చేతిలో ఉంది. ఏఐ లో పలు పదాలు రోజూ వినిపిస్తుంటాయి కానీ వాటి అర్థం చాలామందికి సరిగ్గా తెలియదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అంటే మామూలుగా మనుషులు తెలివితో చేసే పనులను మెషీన్లు చేయగలగడం అనే ఒక్క పెద్ద ఐడియా. మెషీన్ లెర్నింగ్ (ఎమ్ఎల్) అనేది ఏఐ లో ఒక భాగం. ఇక్కడ సిస్టమ్స్ ముందుగా రాసిన రూల్స్ ఫాలో అయ్యే బదులు డేటా నుండి ప్యాటర్న్లు నేర్చుకుంటాయి. మీ ఈమెయిల్ స్పామ్ ఫిల్టర్, ఓటీటీ ఛానెల్స్ లో మూవీ రెకమెండేషన్స్, మీ ఫోన్లో ఫేస్ ఐడీ, ఇవన్నీ ఎమ్.ఎల్ టెక్నాలజీలే. ఇవి చాలా సంవత్సరాలుగా అందుబాటులో ఉన్నాయి.

ఈ మధ్య అందరూ మాట్లాడుకుంటున్నది జెనెరేటివ్ ఏఐ (జెన్ ఏఐ) గురించి. ఇది ఎనాలిసిస్ చేయడం లేదా క్లాసిఫై చేయడం మాత్రమే కాకుండా, కొత్త కంటెంట్ తయారు చేసే ఏఐ. జెన్ ఏఐ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్.ఎల్.ఎమ్‌లు) ద్వారా సాధ్యం అవుతోంది. ఓపెన్ ఏఐ (ఛాట్‌జీపీటీ), క్లాడ్, గూగుల్ లాంటి కంపెనీలు వీటిని తయారు చేస్తున్నాయి. ఇవి విస్తృతమైన టెక్స్ట్, ఇమేజెస్, వీడియోస్ మీద ట్రెయిన్ అయి ప్యాటర్న్లు నేర్చుకుని మనుషులలా రాయగలవు, మాట్లాడగలవు, ఆలోచించగలవు, సహాయం చేయగలవు. ఇవాళ ఎవరైనా "ఏఐ" అంటే దాదాపుగా జెన్ ఏఐ గురించే మాట్లాడుతున్నారు.

## ఏ.ఐ కలకలం

ఇప్పటివరకు వచ్చిన ప్రతి పెద్ద టెక్నాలజీ, ప్రింటింగ్ ప్రెస్, ఎలక్ట్రిసిటీ, ఇంటర్నెట్, ఇవన్నీ మనం అప్పటికే చేస్తున్న పనుల్ని వేగంగా లేదా భారీ ఎత్తులో చేయడంలో సహాయపడ్డాయి. జెన్ ఏఐ మాత్రం మనుషులు మాత్రమే చేయగలరని మనం ఇంతకాలంగా నమ్మిన పనులని కూడా చేస్తుంది. అందుకే జెన్ ఏఐ పట్ల ఆందోళన ఎక్కువగా ఉంది. జెన్ ఏఐ మోడల్స్ లోపల ఏం జరుగుతోంది అని తెలుసుకుంటే వీటి పట్ల ఒక మంచి అవగాహన ఏర్పడుతుంది, ఆందోళన తగ్గుతుంది. మీరు ఒక ఎల్.ఎల్.ఎమ్ ని ప్రశ్న అడిగినప్పుడు, అది ఏదో డేటాబేస్ లో సమాధానం వెతకడం లేదు. అది ట్రైనింగ్ లో నేర్చుకున్న ప్యాటర్న్ ఆధారంగా అత్యంత సరైన సమాధానం ఏమిటో పదం పదంగా అంచనా వేస్తోంది. (ఇది ఎలా పనిచేస్తుందో క్లియర్ గా తెలుసుకోవడానికి ఆర్టికల్ చివర ఒక క్యూ ఆర్ కోడ్ ఉంది. చూడండి). ఈ విషయం అర్థమైతే చాలా వరకు మిస్టరీ తొలగిపోతుంది. ఇది మ్యాజికల్ బ్లాక్ బాక్స్ కాదు. ఇది చాలా అడ్వాన్స్‌డ్ ప్యాటర్న్ ఇంజిన్.

ఇది ఎప్పుడూ ఇంతటికే పరిమితమై ఉంటుందా అన్నది ఎవరికీ ఖచ్చితంగా తెలియదు. ప్రపంచంలోని ప్రతి పెద్ద ఏఐ కంపెనీ, ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏ.జీ.ఐ) అని పిలవబడే దాని వైపు పరుగెడుతోంది. ఏజీఐ మనుషులలా ఆలోచించగల, ప్లాన్ చేయగల, బహుశా ఐడియాలను ఒరిజినేట్ చేయగల సిస్టమ్స్. అవి ఐదు సంవత్సరాల్లో రావచ్చు, యాభై సంవత్సరాల్లో రావచ్చు, లేదా మనలో ఎవరూ ఊహించలేనంత త్వరగా రావచ్చు. ఇటువంటి ప్రభంజనాన్ని కేవలం ప్రేక్షకులుగా చూస్తూ ఉండటం మాత్రం మంచి ప్లాన్ కాదు. ఏఐ ఒక శక్తివంతమైన టూల్ గా మిగిలినా, అంతకు మించినదిగా మారినా, ప్రస్తుతం దానిని వాడటం నేర్చుకున్న వాళ్లే లాభ పడతారు అన్నది మాత్రం నిజం.

## ఏ.ఐ టూల్స్ ని ఎలా వాడుకోవచ్చు?

స్టూడెంట్స్ కి: రాత్రి పదకొండు గంటలకు ఆర్గానిక్ కెమిస్ట్రీతో కష్టపడుతున్న ఒక స్టూడెంట్, ట్యూషన్ టైమ్

అయిపోయిన చాలా సేపటి తర్వాత, ఒక ఏఐ అసిస్టెంట్ ఓపెన్ చేసి ఓపికగా స్టెప్ బై స్టెప్ వివరణ పొందగలదు. తన టెక్స్ట్‌బుక్, ఇప్పటివరకు సేవ్ చేసుకున్న యూట్యూబ్ వీడియో లింక్స్, టీచర్ షేర్ చేసిన ఆర్టికల్స్, తన సొంత క్లాస్ నోట్స్, ఇవన్నీ గూగుల్ నోట్‌బుక్ ఎల్.ఎమ్ లాంటి టూల్‌లో అప్‌లోడ్ చేసి, ఆ మొత్తం కలెక్షన్‌తో సంభాషించ గలదు. ప్రశ్నలు అడగడం, సమ్మరీలు తీసుకోవడం, సోర్సెస్ క్రాస్-రిఫరెన్స్ చేయడం, ఆ టాపిక్ ని మొదటి నుండి ఎలా నేర్చుకోవాలో క్లియర్ గా ఇవ్వగలదు. ఇవన్నీ విద్యార్థులు ప్రభావవంతంగా చదువుకోవడానికి ఉపయోగపడతాయి.

వర్కింగ్ ప్రొఫెషనల్స్ కి: ఉదయానికి ప్రెజెంటేషన్ రెడీ చేయాల్సిన ఒక వర్కింగ్ ప్రొఫెషనల్ మైక్రోసాఫ్ట్ కో-పైలట్ ఉపయోగించి ఫస్ట్ డ్రాఫ్ట్ తయారు చేసుకోగలరు, కీ పాయింట్స్ ఆర్గనైజ్ చేసుకోగలరు, విజువల్స్ కూడా సజెస్ట్ చేయించుకోగలరు.

పేరెంట్స్‌కి: ఎప్పుడో చదివి మర్చిపోయిన టాపిక్ మీద తమ పిల్లవాడికి స్కూల్ ప్రాజెక్ట్‌లో హెల్ప్ చేయాలనుకునే పేరెంట్ చాట్ జీపీటీ, గూగుల్ జెమినీ వంటి అసిస్టెంట్స్‌తో కూర్చుని వాళ్ళతో పాటే నేర్చుకోగలరు.

మీరు స్టూడెంట్ అయితే, మీరు అందరికంటే లక్కీ పొజిషన్ లో ఉన్నారు. మీకు టైమ్ ఉంది, ఉత్సుకత ఉంటే ఏ.ఐతో చేయగలిగినది చాలా ఉంది.

## నేర్చుకోవటం ఎలా?

ఏ ప్రొఫెషన్ లో అయినా, ఏ సైన్స్ లో అయినా, ఏ ఫీల్డ్ లో అయినా, ముందుకు సాగడం ఎప్పుడూ సరైన ప్రశ్నలు అడగడం మీదే ఆధారపడి ఉంటుంది. ఏఐ విషయంలో కూడా ఇది వర్తిస్తుంది. ఏఐ ని అస్పష్టమైన ప్రశ్న అడగండి, అస్పష్టమైన సమాధానం వస్తుంది. ఆలోచించి, స్పష్టంగా, సరిగ్గా ఫ్రేమ్ చేసి అడగండి. అది, తన సమాధానాలతో, మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది.

ఏఐ తో క్విక్ ఆన్సర్స్ కోసం కాకుండా మంచి ప్రశ్నలు ఫ్రేమ్ చేయడం నేర్చుకోండి. లోతులేని పేలవమైన సమాధానం ఇస్తే తిరస్కరించండి. దాని రీజనింగ్ వివరించమని అడగండి. తప్పులు ఎత్తి చూపించండి. అది ఎలా రెస్పాండ్ అవుతుందో చూడండి. ఏఐ కి మిమ్మల్ని పొగిడి మునగచెట్టు ఎక్కించడం చాల తేలిక. అలా కాకుండా ఉండాలంటే దాని జవాబులను సునిశితంగా పరిశీలించండి.

ఏఐ ని గూగుల్ సెర్చ్ వాడినట్టు వాడకండి.

నైపుణ్యం ప్రాక్టీస్ తో వస్తుంది. ఏఐ ని రోజూ వాడండి. చదువుల కోసం మాత్రమే కాదు. వీకెండ్ ప్లాన్ చేయడానికి, ఒక మూవీ గురించి ఆర్గ్యుమెంట్ సెటిల్ చేయడానికి, ఒక న్యూస్ హెడ్‌లైన్ అర్థం చేసుకోవడానికి, మెరుగైన మెసేజ్ రాయడానికి, కొత్త పదం నేర్చుకోవడానికి. ఎంత ఎక్కువ వాడితే, ఏం అడగాలో, ఎప్పుడు నమ్మాలో, ఎప్పుడు క్వశ్చన్ చేయాలో అంత బాగా తెలుస్తుంది. అది చెప్పిందల్లా ప్రశ్నించకుండా నమ్మితే సరైన ఫలితం ఉండదు.

## విమర్శకుల అభిప్రాయం

ఈ మధ్య కొందరు ఏఐ చాలా ఎనర్జీ వాడుతుంది, ప్లానెట్ కి మంచిది కాదు అని అంటుంటారు. అది ఆలోచించదగ్గ విషయమే. ఏఐ మోడల్స్ ట్రెయిన్ చేయడానికి, రన్ చేయడానికి చాలా పవర్ కావాలి. మూవీ స్ట్రీమ్ చేయడానికి, గూగుల్ సెర్చ్ చేయడానికి, గంటల తరబడి సోషల్ మీడియాలో స్క్రోల్ చేయడానికి కూడా ఎనర్జీ అవసరం. ఎనర్జీ ఖర్చు అనేది ఇండస్ట్రీ తప్పక సాల్వ్ చేయాల్సిన సమస్య, మెరుగైన హార్డ్‌వేర్, క్లీన్ ఎనర్జీ, ఎఫిషియంట్ మోడల్స్ అవన్నీ వస్తాయి. మరికొంతమంది దీనిని వాడటం వల్ల మెదడుకు పదును పెట్టటం తగ్గిపోతుంది అంటారు. ఇంతకూ ముందు చెప్పినట్టు, ఏఐ చెప్పినదానికల్లా మనం సై అంటూ ఉంటే అలా జరగవచ్చు. కానీ, సరిగ్గా వాడితే నా దృష్టిలో అది క్రిటికల్ థింకింగ్ పెంపొందిస్తుంది.

ఇంకా పర్ఫెక్ట్ కాలేదు కాబట్టి ఈ మార్పుకి దూరంగా ఉండటం నా దృష్టిలో సబబు కాదు.

పేరెంట్ గా, మీ పిల్లలు ఏఐ వాడుతున్నారని తెలిస్తే మీ మొదటి రియాక్షన్ దాన్ని తీసేయడం అయ్యుండవచ్చు. వాళ్ళని ఏఐ నుండి దూరం చేయడం కాదు, దాన్ని తెలివిగా వాడటంలో హెల్ప్ చేయగలిగితే మరింత ఉపయోగం ఉంటుంది. ఏఐ తో పని చేయించుకోవడం నేర్చుకోమనండి.

## చివరిగా...

ఏఐ ఇక మన జీవితంలో భాగం అన్నది నిజం. ఇది మన మనుగడకు సహకరించే శక్తా లేక శాపమా అన్నది ప్రశ్న కాదు. మీరు దానితో ఏం చేస్తారు అనేదే ముఖ్యం.

నేర్చుకోండి. నేర్పించండి.

# స్వస్వరూపం

(ఉగాది సాహిత్య పోటీలో విజేతగా నిలిచిన కవిత)

శ్రీనివాస్ బారు (జార్జియా, యూ.ఎస్.ఎ)

అమ్మ ఒడిని మరిచి
ఊరి బడిని విడిచి
భాషలను మథించి పదోత్పత్తి ఛేదించినా
సముద్రపు లోతుని ఆసాంతం శోధించినా
అంతుపట్టని ఆ రహస్యం ఊరిస్తూనే ఉంటుంది.

దేశాల సరిహద్దులు చెరిపి
నాగరికత పరిధులు కొలిచి
అధికార దర్పంతో అనుశాసనం విధించినా
విశ్వజనీనతతో సమత్వం కురిపించినా

గూఢంగా దాగిన ఆ గుట్టు అర్థం కానే కానంటుంది.
మతాల అంతరాలు శోషించి
పురాణ గ్రంధాలు పఠించి
ద్వైతాద్వైతాల వ్యత్యాసం గమనించినా
మూలాధారపు మర్మాన్ని గ్రహించినా
నీలో ఉన్న సత్యం నీకే అందనంటుంది

ఆత్మ ఓ మృగతృష్ణ
నేనో కస్తూరి మృగాన్ని

# తండ్రి మీద రెండు పద్యాలు

తమ్మినేని యదుకుల భూషణ్
కవి, కథకులు, విమర్శకులు, అనువాదకులు
న్యూజెర్సీ, యూ.ఎస్.ఎ

1 బ్రతికున్న రోజుల్లో
నీ తండ్రితో నీవు
చెప్పని సంగతులు
గుర్తుకొచ్చిన ప్రతిసారి

ఎన్నో రోజుల వాన తర్వాత,
ఎండ తిరిగి వచ్చినట్టు –
లోపలా బయటా వెలుగు :

కళ్ళు నిండుకొచ్చి
కదిలే దృశ్యం
మసక బారుతుంది.

2 నీతో నడవలేదు
నీ తండ్రి
నీడలా మారిన వారు
తోడుగా వస్తారంతే
నడివేసవి ఎండలో
నీకీ విషయం
బోధ పడుతుంది.

# మార్పు

విన్నకోట రవిశంకర్
కవి
సౌత్ కారొలినా, యూ.ఎస్.ఎ

తేదీలు మారతాయిగాని
రోజులు మారవు.
ప్రదేశాలు మారతాయిగాని
మనసులు మారవు.

పగళ్లు వెలిగివెలిగి మసిబారిపోతాయి
నిగనిగలాడిన రాత్రి శిరోజాలు
నెరిసిపోతాయి
పగటిని, రాత్రిని కూడా పక్షులు
ఒకే పాటతో సాగనంపుతాయి
సందర్భాలు మారతాయిగాని,
సంగీతం మారదు.

అవే ఆశలు, అవే మోహాలు
అవే చిరునవ్వుల వెనుక అంతరంగపు చీకట్లు
ఎన్ని రకాల కన్నీటి ప్రమిదల్లో నింపినా
అవే కన్నీటి వాన నీళ్లు
అవే ఆత్మలు ధరించిన
రంగురంగుల శరీరాలు.

అన్నీ మారినట్టే ఉంటాయి
కానీ, ఏవీ మారవు.

## ఆలోచనలు & అభిప్రాయాలు

CLASSIC EVENTS LLC
AN EVENT MANAGEMENT COMPANY

Specialized In Event Decorations,
Stage LED Screen Istallations
& Event Planning

+1 (603) 406-9320
cevents4ever@gmail.com
classicevents_4ever

CLASSICEVENTS_4EVER

KINNERA
INDIAN RESTAURANT

Your Destination for
Remarkable Taste



OUR SERVICES

- DINE IN
- TAKE OUT
- CATERING
- ORDER ONLINE
- WEEKEND LUNCH BUFFET
- WEDNESDAY BIRYANI BONANZA
- WEEKEND BREAK FAST

Note:
Free Delivery for Catering Orders

401-321-3060 | www.KinneraRestaurant.com | 259 Front St, Lincoln, RI 02865




శరత్ మహావాది, దీప్తి గోరా, బదరీనాథ్ విస్సాప్రగడ, శ్రేష్ఠ జొన్నలగడ్డ, పాణిని జన్నాభట్ల

**BTSV వ్యవస్థాపక సభ్యులు**



ఈ పత్రికకీ, ఉగాది సాహిత్యోత్సవానికీ చేదోడుగా
నిలిచిన దాతలకీ, సహాయక వర్గానికీ,
సాంస్కృతిక, సామాజిక సంస్థలకీ, శ్రేయోభిలాషులకీ...
మా సాదర ధన్యవాదాలు

www.bostontelugusahithyavedika.org
btsv.org@gmail.com

Designer: G Rajesh, Hyderabad, India. Ph: +91 9010129400